ప్రజాశక్తి

శనివారం 10 జూన్ 2023 · 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

కొనసాగుతున్న బదిలీల ప్రక్రియ

- నేటితో ముగియనున్న ఉపాధ్యాయుల బదిలీలు
- 12న కొత్త స్థానాల్లో చేరనున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. గురువారం నుంచి ఆప్షన్లు పెట్టుకుంటున్నారు. కోరుకున్న స్థానాలను ఎంపిక చేసుకుంటున్నారు. వారం రోజులుగా బదిలీలపై కసరత్తు చేస్తున్న విద్యాశాఖ అధికారులు తర్జనభర్జనల అనంతరం ఖాళీలను ఖరారు చేశారు. వాటిని ఉన్నతాధికారులకు పంపి ఆమోదం పొందారు. ఇప్పుడు ఈ ప్రక్రియ మొదలైంది. శుక్రవారం నాటికి బిఈడీ అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియ ముగిసింది. బదిలీలు గానీ, పదోన్నతులు గానీ ఎంపిక చేసుకున్న స్థానాలకు వెళ్లిపోయారు. అంతా ఆన్‌లైన్‌లోనే జరిగిపోతోంది. ఇంటి నుంచే ఉపాధ్యాయులు కంప్యూటర్లలో ఖాళీలను చూసుకొని తమకు అనుకూలమైన స్థానాలను ఎంపిక చేసుకున్నారు. ఆరు వేల మంది వరకూ బదిలీల్లో భాగస్వాములు కాగా ఇందులో మూడు వేల మందికిపైగా తప్పనిసరిగా బదిలీ అయ్యారు. విద్యాశాఖ అధికారులు సబ్జెక్టుల వారీగా షెడ్యూల్ నిర్ణయించారు. ఖాళీలు ప్రకటించగానే వెంటనే ఆప్షన్లు పెట్టుకుంటున్నారు. ఇదంతా గుట్టుగానే సాగుతోంది. బీఈడీ అసిస్టెంట్ల బదిలీలు, ప్రమోషన్లు పూర్తయ్యాయి. ఇప్పటివరకూ తెలుగు 373, ప్రధానోపాధ్యాయులు 199 మంది, ఇంగ్లీషు 335 మంది, లెక్కలు 409 మంది, పిఎస్ 389 మంది, బయాలజీ 225 మంది, సోషల్ 248 మంది, వ్యాయామ ఉపాధ్యాయులు 148 మంది, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలు 203 మంది బదిలీలు గానీ, ప్రమోషన్లు గానీ పూర్తయ్యాయి. సెకండ్‌గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీలు శనివారం నాడు జరగనున్నాయి. తప్పనిసరిగా బదిలీ కావాల్సిన సెంకడ్‌గ్రేడ్ ఉపాధ్యాయులు 1640 మంది ఉన్నారు. రిక్వెస్టులతో కలిపితే మొత్తం 2747 మంది ఉన్నారు. బదిలీల ప్రక్రియ ప్రశాంతంగా సాగుతోందని యూటిఎఫ్ జిల్లా కార్యదర్శి రవి అన్నారు. ఆశించిన స్థానాలు దక్కడంతో ఉపాధ్యాయులు ఎక్కువ శాతం ▶ 2లో

రిజిస్ట్రేషన్ ఛార్జీల బాదుడు.!

- గరిష్ఠం రూ.10 వేలు..
- కనిష్ట విలువపై 40 శాతం పెంపు
- వ్యవసాయ భూముల పైనా వడ్డన
- వైపాలెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో రూ. ఐదు కోట్ల వరకు భారం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రిజిస్ట్రేషన్ ధరలు ఒక్కసారిగా పెంచే శారు. పట్టణ స్థలాలతో పాటు వ్యవసాయ భూముల, నిర్మాణాల విలువ అంతకంతకు పెరిగిపోవడంతో క్రయవిక్రయాలంటేనే ప్రజలు భయపడే పరిస్థితి నెలకొంది. భూముల మార్కెట్ విలువను ప్రభుత్వం ఉన్నట్టుండి పెంచడంతో క్రయవిక్రయ దారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ముందస్తు సమాచారం, ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించకుండానే ఈ నిర్ణయం తీసుకోవడంపై ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు.

భూముల క్రయవిక్రయాలతో పాటు, రియల్ ఎస్టేట్ వ్యాపారం పడిపోవడంతో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం చాలా వరకు తగ్గింది. ఈ నేపథ్యంలో అనుకున్న లక్ష్యాలు చేరుకునేందుకు రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో ఎక్కువగా క్రయ, విక్రయాలు జరిగే గ్రామాల్లో మార్కెట్ విలువ భారీగా పెంచింది. ప్రస్తుత మున్న విలువ కన్నా కనీసం 30-40 శాతం పెంచారు. మొదట్లో 30 శాతం లోపు పెరగవచ్చని చెప్పిన అధికారులు తీరా 40 శాతం దాకా పెంచేశారు.

- యర్రగొండపాలెం పట్టణంలోని ప్రధాన రహదారి వెంట సర్వే నెంబర్ 55/2, 55లో ఒక చదరపు గజం మార్కెట్ విలువ ప్రస్తుతం రూ.7,500 లుగా ఉంది. ఈ నెల ఒకటి నుంచి ఏకంగా రూ.10 వేలకు చేరింది. అంటే చ.గజానికి ఎన్నడూ లేని విధంగా ఏకంగా రూ.2,500 (33.3 శాతం) పెంచారు. అంటే 100 చ.గలు కొనుగోలు చేసిన వారికి దాదాపు రూ.18,000 అదనపు భారం పడుతోంది. మొన్నటి వరకు చ.గ కనీస విలువ రూ.1500 ఉండగా ఏకంగా రూ.2100 చేశారు. ఏకంగా 40 శాతం పెంచారు. ఒక గుంట స్థలం రిజిస్ట్రేషన్ చేయించుకునే వారికి రూ.5 వేల పైచిలుకు భారం పడుతోంది. ఈ రెవెన్యూలో వ్యవసాయ భూమి కనిష్ట విలువ ఎకరం రూ.2.7 లు నుండి ఒకేసారి రూ.3.5 లక్షలకు చేరింది.

- పుల్లలచెరువు రెవెన్యూలో వ్యవసాయ భూమిని రూ.1.6 లక్షల నుంచి రూ.2.3 లక్షలు చేశారు. ప్రధాన రహదారి వెంట చ.గ. రూ.3,800 ఉండగా దాన్ని రూ.5,500కు పెంచేశారు.

- మిల్లంపల్లి రెవెన్యూలోనూ మొన్నటి దాకా చ.గ రూ.1,200లు కాగా ఇప్పుడు రూ.1,800 చేశారు. వ్యవసాయ భూమి రూ.1.7 లక్షల నుంచి రూ.2.5 లక్షలకు పెంచారు.

- త్రిపురాంతకంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న స్థలాల విలువనూ గతంలో ఉన్న ధర కంటే రూ.2,500 పెంచేశారు.

- గోళ్లవిడిపి పంచాయితీ పరిధిలో మార్కెట్ విలువ ఎకరం రూ.1.5 లక్షలు. ప్రభుత్వం తాజాగా మార్కెట్ ధరతో రూ.2 లక్షలు చేశారు. ఈ మేరకు ▶ 2లో

ఉప్పరపాలెంలో పికెట్ నిర్వహిస్తున్న పోలీసులు

ఉప్పరపాలెంలో పోలీసు పికెట్

3లో ▶

పక్కాగృహాల నిర్మాణాలలో పురోగతి సాధించాలి

కలెక్టర్ రంజిత్‌బాషా

మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జగనన్న కాలనీలలోని పక్కాగహాల నిర్మాణాలలో పురోగతి సాధనకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నుంచి డివిజన్, మండల స్థాయి అధికారులతో ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారులు తమ గహాలను వేగంగా నిర్మించుకునేలా అధికారులు రుణాలిప్పించాలని తెలిపారు. అధికారులకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమన్వయంతో పనిచేస్తేనే మంచి ఫలితాలు లభిస్తాయన్నారు. ఇందుకోసం అధికారులు సమగ్ర ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ స్థాయి నుంచి జిల్లా అధికారి స్థాయి వరకు లక్ష్యసాధన దిశగా ప్రణాళిక ఉండాలన్నారు. వేమూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చిన్నగంజాం, చీరాల ప్రాంతాలలో గహనిర్మాణాల పురోగతి మరింత పెరగాలన్నారు. పునాది దశలో ఉన్న గహాలు రూఫ్ దశకు, రూఫ్‌లోనివి స్లాబ్ దశకు, స్లాబ్లోనివి పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. గడపగడపకూ మన ప్రభుత్వం కింద గుర్తించిన 176 పనులు త్వరగా ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజాప్రయోజనాల కోసం ఎంపిక చేసిన పనులు త్వరగా పూర్తి చేయాన్నారు. ఈ నెల 12న ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభించనున్న నేపథ్యంలో నాడు-నేడు అభివద్ధి పనులను మండల ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా తనిఖీలు చేయాలన్నారు. అలాగే ప్రతి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలను ఉండాలన్నారు. జగనన్న విద్యాకానుక పథకం సామగ్రిని పరిశీలించాలన్నారు. అలాగే అంగన్వాడీ కేంద్రాలలో సంపూర్ణ పోషణ పథకం అమలు తీరును పరిశీలించాలని చెప్పారు. పోషకాహార పదార్థాలు లబ్దిదారులకు అందుతున్నాయో, లేదో విచారించాలన్నారు. రేపల్లె నియోజకవర్గంలో సంపూర్ణ పోషణ పనులు 78 శాతం నమోదు అయ్యిం దన్నారు. ఆ ప్రాంతంలో క్షేత్రస్థాయి పరిశీలన జరగాలన్నారు. సుస్థిరాభివద్ధి లక్ష్యాలు చేరుకునేలా అధికారులు చర్యలు తీసుకోవా లన్నారు. ఉపాధి హామీ పనులు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్.శ్రీధర్, గుంటూరు జెపి సిఇఓ జె.మోహన్‌రావు, ప్రకాశం జెడ్.పి సి.ఇ.ఓ బి.జాలిరెడ్డి పాల్గొన్నారు.

'నవరత్నాల' అమలుతో జిల్లా అభివృద్ధి

- అందుకు అనుగుణంగా అధికారులు పనిచేయాలి
- రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు ఆదేశం

మాట్లాడుతున్న మల్లాది విష్ణు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నవరత్న పథకాలను సమర్ధంగా అమలు చేయడం ద్వారా ప్రకాశం జిల్లాను అన్ని రంగాలలో అగ్రగామిగా ఉంచేలా అధికారులు పనిచేయాలని రాష్ట్ర ప్రణాళికా బోర్డు ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు దిశానిర్దేశం చేశారు. నవరత్న కార్యక్రమాల ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ ఏ. నారాయణమూర్తితో కలిసి శుక్రవారం ఆయన ఒంగోలు వచ్చారు. జిల్లాలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు మరియు ఎనిమిది ప్రాధాన్యతా సూచీల పురోగతిపై కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జిల్లా స్థాయి ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. సమీక్షా సమావేశంలో మల్లాది విష్ణు మాట్లాడుతూ సుస్థిరాభివద్ధి లక్ష్యాలతో నవరత్న పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అనుసంధానం చేసిందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నరత్నాలను సమర్ధంగా అమలు చేయడం ద్వారా సుస్థిరాభివద్ధి లక్ష్యాలకు మరింత చేరువకావచ్చని సూచించారు. జిల్లా అధికారులు ఈ విధంగా పనిచేస్తే జిల్లా ర్యాంకుతోపాటు రాష్ట్ర ర్యాంకు కూడా మెరుగవుతుందన్నారు. బైజూప్ పాఠాలు, పాఠశాలల్లో నాడు వేడు, అమ్మఒడి, విద్యాకానుక, వై.ఎస్.ఆర్. సంపూర్ణ పోషణ వంటి పథకాలు ప్రవేశ పెట్టడంతో పాటు బాల్య వివాహాలు, పాఠశాలల్లో డ్రాపౌట్లు వంటి సామాజిక రుగ్మతలను రూపుమాపేలా మునుపెన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దష్టి పెట్టిందన్నారు. మెరుగైన విద్య, వైద్యం అందించడంతో పాటు పేదరిక నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గతంలో 65.3 శాతం మంది చిన్నారులు, బాలింతల్లో రక్తహీనత ఉండేదని, ఈ నాలుగేళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలతో 53.7 శాతానికి తగ్గి ఆరోగ్యపరిస్థితి మెరుగు పడిందన్నారు. ప్రసవ సమయంలో తల్లుల మరణాల రేటు ప్రతి ▶ 2లో

నవరత్నాల అమలుతో జిల్లా అభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

లక్ష మందిలో గతంలో 100 ఉంటే నేడు 45 కంటే తక్కువగా ఉంటున్నారు. సామాజిక రుగ్మతలను అధిగమించేలా రాష్ట్ర ప్రభుత్వం నవరత్న పథకాలను అమలు చేస్తున్నట్లు విష్ణు వివరించారు. ముఖ్యమంత్రి తీసుకుంటున్న చర్యలతో క్లీన్ ఎనర్జీలో రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో ఏపి ప్రభుత్వ పనితీరుకు ప్రశంసలు లభించడమే ఇందుకు నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. నవరత్నాల ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ నారాయణమూర్తి మాట్లాడుతూ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలతో అనుసంధానం కలిగిన పథకాలకు వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తూ రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందేలా సిఎం దూరదృష్టితో పలు నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా నేరుగా లబ్ధిదారులకే వీటి ప్రయోజనాలను అందిస్తున్నట్లు వివరించారు.

కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ మెరుగైన విద్య, వైద్యం అందించడంతో పాటు జిల్లాలోని బాలులు, గర్భిణులు, బాలింతల్లో రక్తహీనతను నివారించడానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. బడి ఈడు పిల్లలందరూ పాఠశాలల్లో ఉండేలా ప్రత్యేక సర్వే చేయిస్తున్నామని, డ్రాపౌట్స్ లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కుటుంబాలతో సహా వలస వెళుతున్న సందర్భాలలో పిల్లలను అక్కడి పాఠశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. పదోతరగతి పాసైన ప్రతి బాలిక ఆపై తరగతులలో చేరేలా బాలికా వికాసం పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. గర్భిణులు, బాలింతల్లో రక్తహీనతను నివారించడానికి వారు తీసుకుంటున్న ఆహార వివరాలను క్రమంగా ఐ.సి.డి.ఎస్. సిబ్బంది ద్వారా సర్వే చేయిస్తున్నామన్నారు. బాల్య వివాహాలు జరుగకుండా ప్రతి సచివాలయంలో ప్రత్యేక రిజిస్టర్ ఏర్పాటు చేసి స్థానికంగా జరుగుతున్న వివాహాల వివరాలను మహిళా పోలీసులు నమోదు చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. 18 ఏళ్ల నిండని బాలికలకు పెళ్లి చేస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే వాటిని అడ్డుకునేలా అధికారులు దృష్టికి సచివాలయ సిబ్బంది తీసుకువెళ్లేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఫలితంగా జిల్లాలో బాల్య వివాహాలు గణనీయంగా తగ్గాయన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు మరింత చేరువయ్యేలా మండల స్థాయిలో ప్రతి వారం ప్రత్యేక సమీక్షా సమావేశాలు నిర్వహించాలని ఎంపిడిఒలను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్.పి. నాగేశ్వరరావు, సి.పి.ఓ. వెంకటేశ్వర్లు, వివిధ శాఖలజిల్లా అధికారులు, ఎంపిడిఒలు, వైద్యాధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొండపిలో వైసిపికి శత్రువులెవరు..?

- మరోసారి టిడిపిని గెలిపిస్తారా
- రాష్ట్ర ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారులు జూపూడి

ప్రజాశక్తి-సింగరాయకొండ

కొండపి నియోజకవర్గంలో వైసిపికి శత్రువు ఎవరో తెలుసుకోవాలని, దుష్టశక్తులను వదిలిపెట్టి వైసిపి నాయకులను టార్గెట్ చేయడంపై వైసిపి అధిష్టానం సీరియస్‌గా తీసుకున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారులు, ఎస్‌సిసెల్ రాష్ట్ర అధ్యక్షుడు జూపూడి ప్రభాకర్‌రావు తెలిపారు. వైసిపి వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డిపై జరిగిన దాడిని నిరసిస్తూ డాక్టర్ శివరామిరెడ్డి ఆసుపత్రిలో శుక్రవారం రాత్రి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కొండపి నియోజక వర్గ పరిధిలోని వైసిపి నాయకులు, డాక్టర్ శివరామిరెడ్డి అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూపూడి ప్రభాకర్ రావు మాట్లాడుతూ వైసిపి శత్రువు ఎవరో మనం ఎవరిపై పోరాడాలో కొండేపి నాయకులు తెలుసుకోవాలన్నారు. చరిత్ర కలిగిన కుటుంబాల జోలికి వస్తే ఎలా ఉంటుందో చూపిస్తారన్నారు. వైసిపి గొడవల వల్ల కొండేపిలో మూడోసారి టిడిపి అవకాశాలు వైసిపియే ఇచ్చినట్లుగా ఉంటుందన్నారు. దుష్టశక్తులను వదిలి పెట్టి వైసిపి నాయకులను టార్గెట్ చేసి వారిపై దాడులు చేయటం మంచి పద్ధతి కాదన్నారు. గెలవాలన్న కోరిక ప్రతి ఒక్కరికి ఉంటుందని ఓటమిని కూడా తట్టుకొని నిలబడాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటే ఇక్కడ మాత్రం దాడులు చేసుకుంటూ కాలం గడపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి కార్యకర్తలందరూ డాక్టర్ అశోక్ కుమార్‌రెడ్డి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ దాడులపై పోలీసులు సీరియస్‌గా తీసుకొని నిందితులు ఎవరనే విషయాన్ని తేల్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిసిసి బ్యాంక్ ఛైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, బోడపాటి అరుణ, ఎంపిపి కట్టా శోభారాణి, కొండబత్తిన మాధవరావు, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ మాలే రంగారెడ్డి, వైస్ ఎంపిపి ఎస్‌కె.షకీలా, సర్పంచి డాక్టర్ బత్తుల శివరామిరెడ్డి, దేవస్థానం ఛైర్మన్ పామర్తి మాధవరావు, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ రావూరి ప్రభావతి, పల్లా అనురాధ, వైసిపి అధ్యక్షుడు హరిబాబు, తాండ్ర రామ్మూర్తి, భూదా రమణారెడ్డి,వైసిపి యువజన విభాగం అధ్యక్షుడు శీలం రాము, చుక్కా కిరణ్‌కుమార్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జూపూడి ప్రభాకరరావు

కొనసాగుతున్న బదిలీల ప్రక్రియ

(మొదటిపేజీ తరువాయి)

సంతృప్తిగానే ఉన్నారన్నారు. ఇక బదిలీల ప్రక్రియ శనివారంతో ముగియనుంది. ఈ నెల 12న బదిలీలు కాబడిన స్థానాల్లో చేరిపోవాల్సి ఉంది. ఇక ఆరోగ్యాలు, ఇతర సమస్యలతో ఉన్నవారిని ప్రాధాన్యత కేటగిరీలో పెట్టారు. వారికి పట్టణాలకు దగ్గరలో ఉన్న స్థానాల్లో అవకాశాలు కల్పించారు.

వధూవరులకు ఆశీర్వాదం

కొమరోలు: రౌతుపల్లె గ్రామానికి చెందిన అవిశనేని ఎరుకలయ్య, శ్రీదేవి దంపతుల కు మారుడు సత్యనారాయణ,త్రిష వివాహ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. .

CHANGE OF NAME

I, **RONDA VENKATA NAGAMANI**, (Old Name), W/o. **RAJULA VENKATA RAMANAREDDY** residing at Door No.9-95A, Choudary Nagar, Martur, Bapatla Dist-523301. Hence I have changed my name to **RAJULA NAGAMANI** (New Name), here after My name is known as **RAJULA NAGAMANI** (New Name). Any details contact to: **8978537333.**

రిజిస్ట్రేషన్ ఛార్జీల బాదుడు

(మొదటిపేజీ తరువాయి)

రిజిస్ట్రేషన్ ఛార్జీలు సైతం పెరగనున్నాయి. అంటే కొనుగోలుదారులకు స్టాంపు డ్యూటీ రూపంలో ఎకరాకు కనీసం రూ.3,500 అదనపు భారం పడుతోంది.

వైపాలెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో..

యర్రగొండపాలెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోని మూడు మండలాల్లో తొమ్మిది గ్రామాల్లో విలువ పెంపు అమల్లోకి వచ్చింది. యర్రగొండపాలెం మేజర్ పంచాయితీతో పాటు మిల్లంపల్లి, గోళ్లవిడిపి త్రిపురాంతకం మండలంలో త్రిపురాంతకం, గణపవరం, మేడపి గ్రామాల్లో, పుల్లలచెరువు మండలంలో పుల్లచెరువు, యండ్రపల్లి, ముటుకుల గ్రామాల్లో పెరిగాయి. గ్రామాల్లోని వ్యవసాయ భూముల విలువ పెరగడంతో కొనుగోలు దారులు ఇబ్బందులు పడుతున్నారు.

భాగ పరిష్కారాలు కాక..

షేక్ వలీ, యండ్రపల్లి, పుల్లలచెరువు మండలం

రైతులు గ్రామాల్లో భాగ పరిష్కారాలు చేసుకోవడం పెద్ద భారమవుతోంది. పెరిగిన ధరలతో రైతులు వాటి జోలికి వెళ్లడం లేదు. వివాదాలు మరింత పెరిగే అవకాశం ఉంది. అటు కుటుంబాలు విడిపోయినా భూములు ఉమ్మడి భాగస్వామ్యంలో ఉండిపోయి ప్రభుత్వ పథకాలు అందే పరిస్థితి లేకుండా పోతోంది.

అభివృద్ధిపై శ్రద్ధ ఏదీ?

షేక్ అమీర్ బాషా, సిటియు కార్యదర్శి, యర్రగొండపాలెం

ప్రభుత్వం ఆదాయం పెంపుపై శ్రద్ధ పెడుతున్నా అభివృద్ధి కోసం నిధులు వెచ్చించే పరిస్థితి లేకుండా ఉంది. పల్లెలు, పట్టణాల్లో రహదారుల నిర్మాణాలకు తట్టెడు మట్టి వేసిన పాపాన పోలేదు. విలువల పెంపుతో లావాదేవీలకు వెనుకాడే పరిస్థితి నెలకొంది.

ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది

ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం సింగరాయకొండ గ్రామం గూడూరి రవీంద్ర కుమార్ తండ్రి వెంకటేశ్వర్లు కు చెందిన సింగరాయకొండ మండలం సోమరాజుపల్లి గ్రామ సర్వే నెంబరు 500/Aii లో 466.4 చ.గ ల 137, 138 ప్లాట్లకు సంబంధించి సింగరాయకొండ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు లో రిజిస్టర్ కాబడిన డాక్యుమెంట్ నెం 1297/2011 దస్తావేజులు రైల్వే స్టేషన్ నుండి వస్తుండగా పోయినవి. దొరికిన వారు ఈ క్రింది చిరునామాకు తెలియజేయవలసినదిగా కోరుచున్నాను.

గూడూరి రవీంద్రకుమార్
S/o వెంకటేశ్వర్లు
పోస్టాఫీసు దగ్గర
సింగరాయకొండ, ప్రకాశం జిల్లా
సెల్ నెం : 9030363999

మహారాజశ్రీ మార్టూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్.నెం: 129/2021

1. దారా చంద్రకళ ....వాది

వర్సెస్

నారు వెంకటరెడ్డి వగైరా .... ప్రతివాదులు

1) డి1. నారు వెంకటరెడ్డి, తండ్రి: వెంకటరెడ్డి, వయసు 49 సం॥లు, హిందూ, వ్యాపారం, డోర్ నెం: 1-203-ఎ-185, 1వ వార్డు, మార్టూరు. ప్రకాశం జిల్లా.

2) డి2. దర్శనం చిన్నయేసు, తండ్రి: లేట్ వెంకటయ్య, వయసు 41 సం॥లు, హిందూ, వ్యాపారం, నివాసం: డ్రైవర్స్ కాలనీ, రైల్వే స్టేషన్ రోడ్డు, మార్టూరు, ప్రకాశం జిల్లా.

పై నెంబరులోని దావా లోని వాది దావా పరిహారం రాబట్టుకొను నిమిత్తం దావా దాఖలు చేయగా ఈ విషయమై మీకు ఎన్ని పర్యాయములు కోర్టు నుంచి సమను పంపినను ముట్టని కారణం చేత శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. కావున పై దావాలో మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్నయెడల మీరు స్వయముగా గానీ, లాయర్ ద్వారా గానీ తేదీ: 22-06-2023న ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు తెలుపు కొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు దావాను విచారించి తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

మార్టూరు
తేదీ: 9-6-2023
వాయిదా తేదీ: 22-06-2023 ఇట్లు
వేముల క్రిష్ణారావు
వాది తరపు న్యాయవాది
మార్టూరు.

మహారాజశ్రీ మార్టూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఐ.ఎ. నెం: 193/2021
ఓ.ఎస్.నెం: 129/2021

దారా చంద్రకళ .... పిటీషనర్/ వాది

వర్సెస్

నారు వెంకటరెడ్డి వగైరా..రెస్పాండెంట్లు/ ప్రతివాదులు

1) ఆర్1. నారు వెంకటరెడ్డి, తండ్రి: వెంకటరెడ్డి, వయసు 49 సం॥లు, హిందూ, వ్యాపారం, డోర్ నెం: 1-203-ఎ-185, 1వ వార్డు, మార్టూరు. ప్రకాశం జిల్లా-523316.

2) ఆర్2. దర్శనం చిన్నయేసు, తండ్రి: లేట్ వెంకటయ్య, వయసు 41 సం॥లు, హిందూ, వ్యాపారం, నివాసం: డ్రైవర్స్ కాలనీ, రైల్వే స్టేషన్ రోడ్డు, మార్టూరు, ప్రకాశం జిల్లా.

పై నెంబరు ఐఎలో పిటీషనర్ ఇంజక్షన్ కొరకై పిటీషన్ దాఖలు చేసినందున ఈ విషయమై మీకు ఎన్ని పర్యాయములు కోర్టు నుంచి నోటీసులు పంపినను తీసుకొనక వెనుకకు తిప్పి పంపు చున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయమని ఆర్డర్ వేసి యున్నారు. కావున ఈ విషయమై తేదీ: 22-06-2023న ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయముగా లేదా లాయర్ ద్వారా హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై నెంబరు ఐ.ఎ.ను మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

మార్టూరు
తేదీ: 9-6-2023
వాయిదా తేదీ: 22-06-2023 ఇట్లు
వేముల క్రిష్ణారావు
వాది తరపు న్యాయవాది
మార్టూరు.

మహారాజశ్రీ ఒకటవ అడిషనల్ జిల్లా జడ్జి వారి కోర్టులో,ఒంగోలు

MVOP : 227/2021

మేకల రాహేలు మరియు ఇతరులు ... పిటిషనర్స్

వర్సెస్

కుమ్మర నాగ మరియు ఇతరులు ....రెస్పాండెంట్స్

To

(R1) కుమ్మర నాగ, తండ్రి కోటయ్య, శాంతినగర్, పేరాల చీరాల మండలం.

పై నెంబర్ పిటిషన్ లో మీరు ఒకటో రెస్పాండెంట్ అయి ఉన్నారు మీకు పలుమార్లు కోర్టు వారు వాయిదా నోటీసులు పంపినను మీరు తీసుకోనందున పత్రికా ప్రకటన ద్వారా తెలియ పరచమని ఉత్తర్వులు ఇవ్వడమైనది. మీ హాజరు కొరకు తేదీ 16-06-2023 న ఉదయం 10.30 గంటలకు కేసు వాయిదా ఉన్నది. ఆ రోజున మీరు స్వయంగా గాని మీ లాయర్ గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియపరచగలరు .లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఒంగోలు ఇట్లు
తేదీ: 09-06-2023
యం.బలరామ్,
అడ్వకేట్,ఒంగోలు
సెల్: 9866207177

గ్రామ పంచాయితీ కార్యాలయం, యర్రగొండపాలెం

ఆర్‌ఓసి నెంబర్ : 10-2023 **టెండరు ప్రకటన** **తేది : 08.06.2023**

సూచిక : యర్రగొండపాలెం గ్రామ పంచాయితీ తీర్మానం నెంబర్ : 124, తేది : 24-04-2023

యర్రగొండపాలెం గ్రామ పంచాయితీకి 2023-24 సంవత్సరమునకు అనగా 01-07-2023 నుంచి 30-06-2024 వరకు కాంట్రాక్టు పద్ధతిపై పని చేయుటకు ఈ క్రింది విధంగా కోరడమైనది.

వివరములు	సప్లయి చేయవలసిన సిబ్బంది సంఖ్య	టెండరు దరావత్తు	టెండరు షెడ్యూల్ ధర
1. ప్రజారోగ్యం నందు స్వీపర్లుగా పని చేయుటకు	22	2000	100
2. వీధిలైట్లు రిపేరు నిమిత్తము ఎలక్ట్రీషియన్‌గా పని చేయుటకు	2	500	100
3. వాటర్ వర్క్స్ నందు టర్న్‌కాక్‌గా పని చేయుటకు	3	500	100
4. చెత్త తోలుటకు ట్రాక్టర్ డ్రైవర్లు పని చేయుటకు	2	500	100
5. జే.ఏ.బి.సి సహాయకులుగా పని చేయుటకు	1	200	100
6. కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేయుటకు	1	200	100

పైన తెలుపబడిన టెండర్లను వారికి ఎదురుగా చూపబడిన టెండరు దరావత్తు చెల్లించి పూర్తి చేసిన టెండరు ఫారములను 19.06.2023 మధ్యాహ్నం 1.00 గంటలోపు ఈ కార్యాలయమును అందజేయవలయును. రాబడిన టెండర్లను అదే రోజు మధ్యాహ్నం 3.00 గంటలకు హాజరైన టెండరు దారుల సమక్షములో తెరువబడును. ఇతర నియమ నిబంధనలు పంచాయితీ కార్యాలయము నందు తెలుసుకొనవలయును.

గమనిక : 1). గ్రామ పంచాయితీ నిధుల సౌలభ్యమును బట్టి జీతములు చెల్లించబడును.

2). పంచాయితీ కార్యదర్శికి టెండర్ రద్దు చేయుటకు, అమలు పరచుటకు పూర్తి అధికారము కలదు.

3). కాంట్రాక్టు సిబ్బందిని గ్రామ పంచాయితీ సిబ్బందిగా పరిగణించబడదు.

4). పని సంతృప్తిగా లేని యెడల సదరు కాంట్రాక్టును రద్దు చేయు అధికారము గ్రామ పంచాయితీ వారికి కలదు.

ఈదుల రాజశేఖర్‌రెడ్డి,
పంచాయితీ కార్యదర్శి,
గ్రామ పంచాయితీ కార్యాలయం, యర్రగొండపాలెం.

ఉప్పరపాలెంలో పోలీసు పికెట్

గురువారం అర్ధరాత్రి రెండు గ్రూపుల కొట్లాట ● ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల పట్టణం ఉప్పరపాలెంలో ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇరు వర్గాల మధ్య ఆధిపత్యం కోసం గురువారం రాత్రి జరిగిన ఘర్షణలో పలువురు గాయాలపాలై ఆసుపత్రిలో చేరారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల పట్టణం ఉప్పరపాలెంలో గత కొన్ని దశాబ్దాలుగా రెడ్డి సామాజిక వర్గం కుటుంబాలకు సంబంధించి కుల, గ్రామ పెద్దలుగా వ్యవహరించేందుకు 12 మందితో కూడిన కమిటీ ఏర్పాటు చేసుకుంటారు. గ్రామంలో ఏ చిన్న సమస్య వచ్చినా ఈ కమిటీ న్యాయబద్ధంగా వ్యవహరించి బాధితులకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తుంది. అదిగాక ఉత్సవాలు, ఇతర జాతరలు దేవాలయ కార్యక్రమాలు ఈ 12 మంది కమిటీ ఆధ్వర్యంలో ప్రజలు నిర్వహిస్తారు. ఈ కమిటీకి గ్రామపెద్దగా యేట్ర సూర్యనారాయణరెడ్డి వ్యవహరించారు. ఒక నెల రోజుల క్రితం ఏట్ర సూర్యనారాయణరెడ్డిని గ్రామపెద్దగా తొలగించేందుకు తీర్మానం చేశారు. అయితే తిరిగి కమిటీ ఏర్పాటుకు సంబంధించి జరిగిన సమావేశం సందర్భంగా ఆధిపత్యం కోసం ఘర్షణలు జరిగాయి. తీవ్ర ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. గొడవల్లో గాయపడిన వారిని బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. రాత్రికి రాత్రి ఉప్పరపాలెంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. కమిటీ ఏర్పాటు సజావుగా చేసుకోవాలని పలువురు ఆ సామాజిక వర్గం పెద్దలు సూచించినప్పటికీ కొందరు తామే పెత్తనం చేయాలని ఆలోచనతో ఈ వివాదాలు పెట్టుకుని గొడవలకు దిగినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఉప్పరపాలెంలో పోలీస్ పికెట్ కొనసాగుతోంది. బాపట్ల పట్టణం ఉప్పరపాలెంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు డిఎస్పి వెంకటేశ్వర్లు నేతృత్వంలో ఉప్పరపాలెంలో ప్రత్యేక పోలీసు సిబ్బందితో పికెట్ ఏర్పాటు చేశామని పట్టణ సీఐ కృష్ణయ్య తెలిపారు. అల్లర్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతియుతంగా చర్చలు జరుపుకుని సమస్యను పరిష్కరించుకోవాలని కోరారు. రెచ్చగొట్టుకుని వివాదాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని అన్నారు.

బాపట్లలో ప్రయివేటు పాఠశాలల దోపిడీ

చోద్యం చూస్తున్న అధికారులు ● తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్న ప్రజలు

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

పాఠశాలలు ఇంకా పున: ప్రారంభించకముందే బాపట్ల పట్టణంలోని కొన్ని ప్రైవేటు పాఠశాలలు విద్యార్థుల నుంచి డబ్బుల దోపిడీకి తెరలేపారు. ఇప్పటి నుంచే విద్యార్థులకు పాఠాలు హోం వర్క్ ఇస్తున్నారు. దానికి సంబంధించి సిలబస్‌ను వాట్సాప్ గ్రూపుల ద్వారా పంపుతున్నారు. దానికి కావాల్సిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, కొనుగోలు చేసుకోవాలని మెసేజ్‌లు పంపిస్తున్నారు. 5వ తరగతి నుంచి పై తరగతుల విద్యార్థులకు సంబంధించిన పుస్తకాల ధర రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు విక్రయిస్తున్నారు. అలాగే యూనిఫాం, ఇతర సామగ్రి అధిక ధరలకు విక్రయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. దీంతో తల్లిదండ్రులు డబ్బుల కోసం పరుగులు తీస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల అవరణలోనే పుస్తకాలు, యూనిఫాం, ఇతర వస్తువులు విక్రయిస్తున్నారు.

బాపట్లలోని కొన్ని ప్రయివేట్ పాఠశాలల భవనాలు

విద్యను వ్యాపారంగా మార్చిన కార్పొరేట్ సంస్థలు

పిల్లలకు సేవా దృక్పథంతో పాఠాలు నేర్పించి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు సేవ చేయడానికి వచ్చామని ప్రభుత్వంతో చెప్పి అనుమతులు పొందాక వ్యాపారమే పరమావధిగా ప్రవర్తించడం సిగ్గుచేటని మేధావులు విమర్శిస్తున్నారు. అన్ని దానాల్లో గొప్పది విద్యా దానం అనే సూక్తికి తూట్లు పొడుస్తూ ఉన్నత విద్యనభ్యసించి నేడు సమాజంలో పెద్ద పెద్ద విద్యాలయాలు ఏర్పాటు చేసి సేవగా చేయాల్సిన విద్యను పక్కా వ్యాపారంగా మార్చిన ఘనత వీరిది.

విద్యా కేంద్రం బాపట్ల

ఎడ్యుకేషన్ సెంటర్ అయిన బాపట్లలో మొత్తం 32 ప్రయివేటు పాఠశాలలు ఉన్నాయి. 80వ దశకంలో బాపట్లలో ప్రయివేటు పాఠశాలల ప్రస్థానం ప్రారంభమైంది. అప్పట్లో ఠాగూర్, జవహర్, బాల భారతి, రామా ట్యుటోరియల్స్ వంటి పాఠశాలలు దశాబ్దాల తరబడి విద్యను అందించి పేరు గడించాయి. బాపట్లను విద్యా కేంద్రంగా తీర్చిదిద్దటంలో ఆ పాఠశాలల కృషి ఎంతో ఉంది. వారు ఇప్పటిలా వ్యాపార దృక్పథంతో పాఠశాలలు నిర్వహించలేదు. ఆదర్శంగా విద్యా విలువలకు కట్టుబడి ఉన్నారు. కాలక్రమేణా కొత్తగా ఎన్నో ప్రయివేటు పాఠశాలలు వెలిశాయి. కార్పొరేట్ పాఠశాలలు సైతం వచ్చాయి.

కొత్త దశాబ్దంలో విద్యా వ్యాపారానికి తెర

2000 సంవత్సరం తర్వాత బాపట్లలో విద్య వ్యాపారంలా మారింది. అప్పటి నుంచి ప్రారంభమైన దోపిడీ నేడు పరాకాష్టకు చేరింది. కొన్ని ప్రయివేటు పాఠశాలల్లో అడ్మిషన్ ఫీజు తరగతిని బట్టి రూ.2 వేల నుంచి రూ.10 వేలు, పుస్తకాలు రూ.3 వేల నుంచి రూ.12 వేలు తరగతిని బట్టి వసూలు చేస్తున్నారు. ఇక ఫీజులైతే నర్సరీకి రూ.7 వేల నుంచి మొదలు పెట్టి పదో తరగతి వచ్చే సరికి 30 వేలకు పైనే వసూలు చేస్తున్నారు.. ఇక కార్పొరేట్ పాఠశాలల్లో అయితే సామాన్య మధ్య తరగతి వర్గాలకు చెందిన వారు చదివే అవకాశమే ఉండదు. చెల్లించిన సొమ్ముకు సరైన రసీదులు, బిల్లులు ఉండవు. ఎందుకంటే అలా ఇస్తే ప్రభుత్వానికి పన్ను చెల్లించాలి. ఈ విధంగా వారు ఇటు ప్రజలకు, అటు ప్రభుత్వానికి గండి కొడుతున్నారు. బాపట్లలోని బడా ప్రయివేటు పాఠశాలలు నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి యథేచ్ఛగా అడ్మిషన్ ఫీజు, ఎడ్యుకేషన్ ఫీజులు వసూలు చేస్తున్నాయి.

నిబంధనలు ఏమీ చెబుతున్నాయి..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్య అనేది లాభసాటి వ్యాపారంలా చూడకూడదు. సేవా దక్పథంతో పాఠశాలలు నిర్వహించాలి. అవన్నీ తెలిసీ నిబంధనలకు పాతర వేస్తున్నాయి ప్రయివేటు విద్యా సంస్థలు.

ప్రభుత్వ నియమ నిబంధనలను తుంగలో తోసి..

అడ్డగోలుగా డబ్బులు వసూలు చేస్తున్నారు. విద్యను వ్యాపారం చేస్తున్నారు. ఒక విధంగా చెప్పాలంటే ప్రజలను దోచుకుంటున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులు కాకుండా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు.

విద్యా హక్కు చట్టంలో ఏముంటుంది?

పేద విద్యార్థులకు 25 శాతం విద్య అందించాలని ఈ చట్టం చెబుతుంది. ఈ నిబంధన ప్రకారం ఆర్థికంగా వెనుకపడిన విద్యార్థులకు ఉచితంగా విద్య అందించాల్సి ఉంది. కానీ పది శాతం కూడా ఈ నిబంధనను ఎవరూ పాటించడం లేదు. ఈ విషయంపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలని విద్యావంతులు కోరుతున్నాయి. విద్యా సేవ చేస్తామని గుర్తింపు పొందిన ప్రయివేటు పాఠశాలలు విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్నారు.25 శాతం పేద విద్యార్థులకు చదువు చెప్పాలని నిబంధనలు చెబుతున్నాయి. అయితే ఎంత వరకు ఉచిత విద్య ఇస్తున్నారో లెక్క చెప్పాల్సిన అవసరం ఉంది.

పాఠశాల ఆవరణలో పుస్తకాలు అమ్మరాదు..

పాఠశాల ఆవరణలో పుస్తకాలు అమ్మరాదు అని నిబంధనలు చెబుతున్నాయి. ఈ ఏడాది నుంచి ప్రభుత్వమే ప్రయివేటు పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వ సిలబస్ పుస్తకాలను సరఫరా చేస్తుంది. ఈ ఏడాది ప్రభుత్వం సరఫరా చేసే పుస్తకాలు మాత్రమే అందించాలి. కానీ టెక్నో అని, ఐఐటీ ఫౌండేషన్ అని ఎటువంటి అనుమతులు లేకుండా తల్లిదండ్రుల అమాయకత్వాన్ని, అవసరాన్ని ఆసరాగా చేసుకొని పుస్తకాలు అమ్మి డబ్బులు గుంజుతున్నారు.

జిఎస్టీ ఎగవేత

ప్రయివేటు విద్యా సంస్థలు వారికి వచ్చిన ఆదాయంలో ఆయా పతిస్థితులను బట్టి 18 శాతం వరకు జిఎస్‌టి కట్టాల్సి ఉంటుంది. కానీ వీరు సరి అయిన బిల్లులు ఇవ్వకుండా జిఎస్టీ ఎగవేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీని వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.ఇక పాఠశాలల్లో వసూలు చేసే ఫీజు, ఇతర వసూళ్లపై తగిన జిఎస్టీ బిల్లులు ఇవ్వాలి. కానీ కొన్ని పాఠశాలల యాజమాన్యం అలాంటిదేమీ లేకుండా తెల్ల కాగితాలు, ఇతర కొటేషన్ బిల్లులు, రసీదులు వంటివి ఇచ్చి జిఎస్టీ కట్టకుండా తప్పించుకుంటున్నారు. దీనిపై సబంధిత శాఖల అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం: ఎంఇఓ నిరంజన్

ఈ విషయమై బాపట్ల మండల విద్యా శాఖాధికారి నిరంజన్ మాట్లాడుతూ అడ్మిషన్ ఫీజులు వసూలు చేయకూడదన్నారు. అలా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులు మాత్రమే వసూలు చేయాలి. ఫీజుల వివరాలు నోటీసు బోర్డుపై ప్రదర్శించాలి లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాల ఆవరణలో పుస్తకాలు విక్రయాలు చేయకూడదు. ప్రభుత్వం ద్వారా ఇచ్చే పుస్తకాలు మాత్రమే ప్రయివేటు పాఠశాలలో పిల్లలకు ఇవ్వాలి. అలా చేయకుండా ఇతరత్రా పుస్తకాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం. పై వాటికి విరుద్ధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు, గుర్తింపు రద్దు చేస్తాం. చెల్లించిన ఫీజులకు రసీదులు ఇవ్వాలి.

అడవి పంది ఢీకొని...

మోటార్ సైకిల్ బోల్తా.. రైతు మృతి

ప్రజాశక్తి-మార్కాపురం

అడవి పంది ఢీకొనడంతో మోటార్ సైకిల్ బోల్తాపడి రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని ఇడుపూరు సమీపంలో గురువారం రాత్రి జరిగింది. ఈ ప్రమాదంలో ఇడుపూరు గ్రామానికి చెందిన యక్కంటి ముద్దారెడ్డి(40) మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. రాత్రి 9 గంటల సమయంలో మార్కాపురం నుంచి మోటార్ సైకిల్‌పై స్వగ్రామమైన ఇడుపూరుకు బయలుదేరాడు. దరిమడుగు దాటిన తరువాత అడవి పంది ఢీకొనడంతో మోటార్ సైకిల్ అదుపు తప్పింది. రైతు యక్కంటి ముద్దారెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన ముద్దారెడ్డిని పట్టణంలోని ఓ ప్రయివేటు వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ముద్దారెడ్డికి భార్య పద్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ముద్దారెడ్డి భౌతికకాయానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-కొండపి

మండల పరిధిలోని పెట్లూరు గ్రామంలో పేకాట శిబిరంపై దాడులు నిర్వహించి ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వైవి రమణయ్య తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.1,010 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

14 మందిపై బైండోవర్ కేసు

ప్రజాశక్తి -గిద్దలూరు రూరల్

గిద్దలూరు పట్టణంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న 14 మందిని గుర్తించి వారిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బ్రహ్మానాయుడు తెలిపారు. సిఐ దేవ ప్రభాకర్, ఎస్ఐ బ్రహ్మానాయుడు ఆధ్వర్యంలో గురువారం రాత్రి పోలీస్ గస్తీ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఆ సమయంలో రైల్వే స్టేషన్, హోటళ్లు, వివిధ ప్రాంతాలలో అనుమానాస్పదంగా తిరుగుతున్న 14 మందిని అదుపులోకి తీసుకొని వారిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-పిసిపల్లి

మండలంలోని పెద్దఇర్లపాడు గ్రామంలో పాలూరి చిన్నకొండయ్య అనే వ్యక్తి అక్రమంగా మద్యం తరలిస్తుండగా శుక్రవారం అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 8 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు.

మంచినీటి చెరువులకు నీరు

ప్రజాశక్తి-కారంచేడు

కారంచేడు పంచాయతీలోని మంచినీటి చెరువులకు పాత నీరు తీసేసి కొత్త నీరు నింపేం దుకు చర్యలు చేపట్టాలని కారంచేడు పంచాయ తీ సాధారణ సమావేశంలో తీర్మానించారు. శుక్రవారం నాడు కారంచేడు గ్రామ పంచాయతీ సాధారణ సమావేశం స్థానిక పంచాయతీ కార్యా లయంలో సర్పంచ్ బాలిగ శివపార్వతి అధ్యక్షత న జరిగింది. ఈ సమావేశంలో గ్రామంలో ఉన్న రెండు చెరువులకు పాత నీరు తొలగించి కొత్తనీరు నింపి ప్రజలకు తాగునీటి అవసరాలు తీర్చాలని తీర్మానం చేశారు. అలాగే గ్రామంలో ఉన్న 32 ఎకరాల జేపీ చెరువు మాన్యం భూములను వేలం ద్వారా కౌలుకు ఇవ్వాలని తీర్మానించారు. అలాగే జేపీ చెరువు చుట్టూ ఉన్నటువంటి కొబ్బరిచెట్లకు ఉన్న కాయలను బహిరంగ వేలం వేయాలని నిర్ణయించారు. అలాగే గ్రామంలో నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణాలకు అప్రూవల్సు ఇవ్వాలని తీర్మానం చేశారు. ఇవన్నీ జిల్లా పంచాయతీ అధికారి ఆమోదం ద్వారా అమలు పరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంజయ్య 13 మంది వార్డు సభ్యులు, ముగ్గురు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులను పూర్తి చేయాలి: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే నాడు-నేడు కింద పాఠశాలలన్నింటిలో చేపట్టిన అభివద్ధి పనులను పూర్తి చేయాలని బాపట్ల జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా ఆదేశించారు. బాపట్ల మండలం అప్పికట్ల గ్రామంలోని జడ్పీ ప్రాథమికోన్నత పాఠశాలలో రూ.42 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. పాఠశాలలో ఆయన కలియతిరిగారు. ప్రతి తరగతి గదిలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అభివృద్ధి పనులపై ఆరా తీశారు. తల్లిదండ్రుల కమిటీ ఆధ్వర్యంలోనే పనులు కొనసాగాలని అన్నారు. పాఠశాల ప్రారంభానికి ముందుగానే భవనాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని

అప్పికట్ల పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

అధికారులను ఆయన ఆదేశించారు. ప్రాథమికంగా మరుగుదొడ్లు, విద్యుత్, మంచినీటి సదుపాయం కల్పించాలని ఆయన సూచించారు. డిజిటల్ తరగతి గది పనులలో పురోగతి ఉండాలని చెప్పారు. అన్ని పాఠశాలలకు ఏర్పాటు చేస్తున్న ల్యాబ్‌లపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జగనన్న విద్యాకానుక కిట్‌లో విద్యార్థులకు పంపిణీ చేయనున్న వస్తువులను ఆయన నిశితంగా పరిశీలించారు. పాఠశాలకు వచ్చిన రాతపుస్తకాలు, పాఠ్య పుస్తకాలను కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం ప్రభుత్వం నిర్దేశించిన 10 అంశాలలో రూ.15.32 లక్షల విలువైన పనులు జరిగాయని అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఆయన వెంట బాపట్ల ఆర్‌డిఒ జి రవీందర్, డీఈవో పీవీ రామారావు, తహశీల్దారు సుధారాణి, ఎంపీడీవో రాధాకృష్ణ, పలువురు అధికారులు, తదితరులు ఉన్నారు.

ఉప సర్పంచ్‌గా నాగరాజు

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు ఉప సర్పంచ్‌గా తులసి నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉప సర్పంచ్ గాదె సురేష్ రాజీనామా చేయటంతో ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల అధికారిగా ఎంఇఓ డి నాగేశ్వరరావు వ్యవహరించారు. పంచాయతీలో 16 మంది సభ్యులు ఉండగా సమావేశానికి 11 మంది హాజరయ్యారు. ఒకే నామినేషన్ దాఖలు కావటం, వచ్చిన సభ్యులంతా నాగరాజుకు మద్దతు తెలపటంతో నాగరాజును ఉప సర్పంచ్‌గా ప్రకటించారు. ఉప సర్పంచ్‌తో ఎన్నికల అధికారి ప్రమాణం స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లా అంజమ్మ, సభ్యులు పాల్గొన్నారు.

కారంచేడు ఎస్ఐ శ్రీనివాసరావు మనుమరాలు పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న ఆమంచి కృష్ణమోహన్, కారంచేడు ఎంపీపీ

పుట్టినరోజు వేడుకల్లో ప్రముఖులు

ప్రజాశక్తి-కారంచేడు

కారంచేడు ఎస్ఐ శ్రీనివాసరావు మనమరాలు పుట్టినరోజు వేడుకలు చీరాలలోని గోలి సదాశివరావు కళ్యాణ మండపంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు పర్చూరు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్, కారంచేడు ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, చీరాల మున్సిపల్ ఆమంచి గ్రూపు కౌన్సిలర్లు సత్యానందం, విజయ భాస్కర్‌రెడ్డి, గాజుల శ్రీహరి, ఏఎంసీ డైరెక్టర్ బజ్జిబాబు, అడపా సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌లో ప్రధానోపాధ్యాయుల బదిలీలు

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు డివిజన్‌లో 60 మంది ప్రధానోపాధ్యాయులు బదిలీపై దరఖాస్తు చేసుకోగా 49 మంది ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. 5 ఏళ్లలోపు సర్వీసు ఉండటంతో 11 మంది ప్రధానోపాధ్యాయులకు ఎక్కడ పని చేస్తున్నారో అదే పాఠశాలలో ఉండేందుకు అవకాశం దక్కింది. డివిజన్ పరిధిలోని 49 హైస్కూళ్లకు కొత్త ప్రధానోపాధ్యాయులు బాధ్యతలు చేపట్టనున్నారు.

ఆన్‌లైన్‌లో శిక్షణ పొందుతున్న పంచాయతీ కార్యదర్శులు

ఆన్‌లైన్‌పై పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

ప్రజాశక్తి-చీరాల

అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో చీరాల నియోజకవర్గానికి సంబంధించిన చీరాల, వేటపాలెం మండలాల్లోని అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఆన్‌లైన్ విధానంపై శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు గ్రామ పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించు భవనాల అనుమతులను అన్నీ ఇకపై ఆన్‌లైన్ ద్వారా ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి పంపించాలని అన్నారు. అనంతరం అనుమతులన్నీ ఆన్‌లైన్ పద్ధతి ద్వారానే మంజూరు చేస్తామని, ఇందుకు సంబంధించిన భవన నిర్మాణ ప్లాన్ తయారు చేసేవారు కూడా ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచే లైసెన్స్ పొందాలని అన్నారు. అనంతరం అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె నేతాజీ మరియు, ఈఓఆర్‌డి బి మురళి, బాపూజీ, చీరాల, వేటపాలెం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ సయ్యద్ అక్తర్ హుసేన్

రైతులకు వైఎస్ఆర్ యంత్ర సేవ పథకం

ప్రజాశక్తి-రేపల్లె: వైఎస్ఆర్ యంత్ర సేవ పథకం అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయ శాఖ ఏడిఏ సయ్యద్ అక్తర్ హుస్సేన్ తెలిపారు. వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యంత్ర సేవ పథకం ద్వారా రైతులకు వ్యవసాయ పనిముట్లను అద్దెకు ఇస్తామని తెలిపారు. వ్యవసాయ పనిముట్లను అద్దె చెల్లించే ప్రాతిపదికన రైతు భరోసా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతులు పనిముట్ల కోసం ఆందోళన చెందకుండా సమయానికి ఉపయోగించుకోవచ్చని అన్నారు. రైతు భరోసా కేంద్రాలలో పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వ్యవసాయ సలహా మండలి సూచనల మేరకు రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులు పలు సూచనలు చేసినట్లు తెలిపారు. ప్రధానంగా జింకు, జిప్సంను 50 శాతం రాయితీపై ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రైతు గ్రూపులకు కాకుండా, వ్యక్తిగతంగా పనిముట్లను అందించాలని కోరారని తెలిపారు. వీటిలో టార్పాలిన్ పట్టాలు, విద్యుత్ మోటార్లు, తైవాన్ స్ప్రేయర్లు, రోటా వేటర్లు, కల్టివేటర్లు ఉన్నట్లు తెలిపారు. ఎరువులు, పురుగు మందులు సకాలంలో అందించాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలు గ్రామాలలో కూడా ఏర్పాటు చేయాలని కోరినట్లు చెప్పారు. రైతుల సూచనలను ఉన్నతాధికారు లకు నివేదించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి ఆర్ విజయబాబు, రైతులు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఒలింపిక్ గేమ్స్ జిల్లా సెలక్షన్స్

ప్రజాశక్తి-వేటపాలెం

స్టూడెంట్ ఒలింపిక్ గేమ్స్ జిల్లా సెలక్షన్లు ఈ నెల 11న మండలంలోని దేశాయిపేట పంచాయతీ రామా నగర్‌లో ఉన్న వివేక స్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు కరాటే మాస్టర్ కావూరి నరేంద్రరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెలక్షన్స్‌లో కరాటే, యోగా, కబడ్డీ, చెస్, క్యారమ్స్ వంటి ఆటలు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆదివారం ఉదయం 8గంటల నుంచి సాయత్రం 6లోపు వివేకా స్కూలుకు రావాలని కోరారు. మరిన్ని వివరాలకు 7396222223 నంబర్‌లో సంప్రదించాలని అన్నారు.

టిడిపి మినీ మేనిఫెస్టో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

మినీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- నియోజకవర్గ సమీక్షా సమావేశంలో టీడీపీ ఇంచార్జి ముత్తుముల
- టిడిపి పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి-గిద్దలూరు

ప్రకాశం జిల్లా, గిద్దలూరు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ శ్రేణులతో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ నాడు తెలుగుదేశం అధికారంలో బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశ పెట్టిందని, వాటి స్ఫూర్తితోనే, మహానాడు వేదికపై టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని మహిళలు, రైతులు, యువత, పేదల భవిష్యత్తుకు గ్యారెంటీ ఇస్తూ మినీ మేనిఫెస్టోను ప్రకటించారని, అందులో భాగంగా 18 ఏళ్ళు నిండిన ప్రతి స్త్రీకి "ఆడబిడ్డ నిధి" పథకం ద్వారా ప్రతి నెల రూ.1,500 రూపాయలు, 'తల్లికి వందనం' పథకం కింద ఇంట్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి రూ.15 వేలు, దీపం పథకం ద్వారా యేటా 3 సిలిండర్లు", "మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం", "అన్నదాత పథకం" ద్వారా ప్రతి రైతుకు యేటా రూ.20 వేల ఆర్థిక సాయం, రాష్ట్రంలోని యువతకు ఉపాధి కల్పించేందుకు 20 లక్షల ఉద్యోగాలకు రూపకల్పన, నిరుద్యోగ యువతకు ప్రతి నెల యువగళం నిధి ద్వారా రూ.3 వేల నిరుద్యోగ భృతి, బీసిలకు రక్షణ చట్టం, ఇంటింటికీ మంచినీరు, పూర్ టూ రిచ్ ద్వారా ప్రతి ఒక్కరినీ ఆర్థికంగా బలోపేతం చేయటం వంటి పథకాలను పొందుపరిచి, మినీ మ్యానిఫెస్టోను ప్రకటించారని అన్నారు. టీడీపీ అధినేత ప్రకటించిన మేనిఫెస్టోను ప్రతి తెలుగుదేశం కుటుంబ సభ్యులు ప్రజల్లోకి తీసుకెళ్లి, గ్రామాల్లోని మహిళలకు, రైతులకు, యువతకు, వివరించాలని తెలుగుదేశం శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలుగుదేశం ప్రకటించిన మేనిఫెస్టోలోని పథకాల పట్ల అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తుంటే, వైసీపీ గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని, వైసీపీ ప్రభుత్వ నయవంచక పాలనలో మోసపోయిన రాష్ట్ర ప్రజలు జగన్ రెడ్డి ప్రభుత్వాన్ని ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశం అనంతరం మినీ మేనిఫెస్టో పోస్టర్లను టీడీపీ శ్రేణులతో కలిసి అశోక్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో గిద్దలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్ ఇంచార్జులు, స్టేట్ కమిటీ, పార్లమెంట్ కమిటీ, నియోజకవర్గ అనుబంధ కమిటీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, యూనిట్ ఇంచార్జులు, బూత్ ఇంచార్జులు, గ్రామ కమిటీ సభ్యులు, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-అద్దంకి

రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని తిమ్మాయపాలెం గ్రామంలో వ్యవసాయ శాఖ సిబ్బందితో భూసార పరీక్షలు, పచ్చిరొట్ట పైర్ల సాగుపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె వెంకటకృష్ణ, సిబ్బంది, ప్రెసిడెంట్ సందిరెడ్డి శ్రీనివాసరావు, సెక్రటరీ చిన్ని మురళీకృష్ణ, షేక్ మహమ్మద్ రఫీ, కురుగంటి హనుమయ్య, బొమ్మినేని వెంకటరావు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ మనకు అనారోగ్యం వచ్చినపుడు టెస్టులు చేయించుకున్నట్లే భూసార పరీక్షలు ఎంతో అవసరమని, ఒక్క రూపాయి ఫీజు కూడా లేకుండానే అర్జీ పెట్టుకున్న వారి భూసార పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని కోరారు. పచ్చిరొట్ట ప్రాముఖ్యతను వివరించారు. రోటరీ క్లబ్ సేవలను అభినందించారు. అనంతరం రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతే దేశానికి వెన్నెముకని, వారు అన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతో ఉన్నదని పేర్కొన్నారు.

భూసార పరీక్షలు గురించి రైతులకు వివరిస్తున్న వ్యవసాయ అధికారి వెంకటకృష్ణ

రైతుల సంక్షేమానికి కృషి : బాలినేని

ప్రజాశక్తి-టంగుటూరు

రైతుల సంక్షేమానికి వైసిపి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు తెలిపారు. మండల పరిధిలోని కొణిజేడు గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ప్రధానమంత్రి కషి సంచాయి యోజన పథకం ద్వారా మంజూరైన వాటర్ షెడ్ పనుల గురించి తెలుసుకున్నారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో మంజూరైన వ్యవసాయ పనిముట్లను పరిశీలించారు. అనంతరం బాలినేని మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అవసరమైన వ్యవసాయ పరికరాలు,

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

పనిముట్లను ఎస్‌సిలకు 10శాతం, మిగతా వారికి 20 శాతం కాంట్రిబ్యూషన్‌తో అందజేస్తుందన్నారు. తన స్వగ్రామం అయిన కొణిజేడు గ్రామ రైతులకు అవసరమైతే ఆ కాంట్రిబ్యూషన్‌ను కూడా తానే చెల్లించి రైతులకు అవసరమైన పరికరాలను అందజేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కొణిజేడు, పరిసర ప్రాంత గ్రామాల ప్రజలకు 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉండాలన్న సదుద్దేశంతో ప్రభుత్వం రూ. 2.70 కోట్లతో టంగుటూరు మండలానికి మంజూరైన రెండవ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కొణిజేడు గ్రామానికి కేటాయించినట్లు చెప్పారు. కొణిజేడు గ్రామంలో సచివాలయం ప్రజలందరికీ అనువుగా లేదని గ్రామస్తులు చెప్పడంతో నూతన సచివాలయం నిర్మాణానికి అవసరమైన స్థలం చూడాలని, స్థలానికి అయ్యే ఖర్చును కూడా తానే భరిస్తానని బాలినేని శ్రీనివాసరెడ్డి గ్రామస్తులకు హామీ ఇచ్చారు. అనంతరం గడప గడపకూ కార్యక్రమంలో భాగంగా మంజూరైన రూ.20 లక్షల నిధులతో నిర్మించిన సైడు కాలువలను కలెక్టర్ దినేష్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ కె.శీనారెడ్డి, గ్రామ సర్పంచి గంజి వెంకయ్య, నాయకులు బాలినేని వెంకటేశ్వర రెడ్డి, ఈదా వెంకటరెడ్డి, ఎంపిటిసి బుర్రా అంకరాజు, ఉప్పలపాటి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తి రామ్‌నగర్‌లో వాటర్‌ప్లాంట్ సమీపంలో దెబ్బతిన్న రహదారిని తక్షణమే నిర్మించి ప్రజల కష్టాలు తీర్చాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. రామ్‌నగర్‌లో ఇంటింటికి సిపిఎం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రామ్‌నగర్‌లో రాత్రి సమయంలో తరచూ కరెంట్ పోతున్నట్లు తెలిపారు. రోడ్డు విరిగిఉండడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ రోడ్డు పై తరచూ మున్సిపల్ ఛైర్మన్ ,కౌన్సిలరు తరచూ రాకపోకలు సాగిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దెబ్బతిన్న రహదారికి మరమ్మతులు చేపట్టాలన్నారు. వీధిలైట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ

దెబ్బతిన్న రహదారిని పరిశీలిస్తున్న నాయకులు

కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పూసపాటి వెంకటరావు, మండల నాయకులు పల్లాపల్లి ఆంజనేయులు, క్రిష్టిపాటి చిన్నపురెడ్డి,పులి ఓబులరెడ్డి, రామ్‌నగర్ శాఖ కార్యదర్శి సిహెచ్. కొండయ్య, టి.శ్రీను,జి శంకర్, పి.విజయ్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే టిజెఆర్. సుధాకర్ బాబు తెలిపారు. మండల పరిధిలోని నిడమానూరు గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధాకర్‌బాబు, ఎంపిపి నలమలపు అంజమ్మ గడపగడపకూ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో

స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధాకర్‌బాబు

సర్పంచి వడ్డిముక్కల శ్రీను ఉపసర్పంచి రమణారెడ్డి,వైసిపి నాయకుడు పులివర్తి పరందామిరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, హరిబాబు, ఎంపిడిఒ జయమణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు

'శ్రీసాధన' విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలోని శ్రీసాధన డిగ్రీ కళాశాలలో ఐసిఐసిఐ బ్యాంకు కొలువుల భర్తీ కోసం టివిఎస్ ట్రెనింగ్ అండ్ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలకు

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

కంభం, గిద్దలూరు, కనిగిరి, యర్రగొండపాలెం, ఒంగోలు తదితర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. మూడంచెల ప్రక్రియలో 52 మందిని ఎంపిక చేసినట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కెవిఎస్ఆర్ పవన్‌కుమార్ తెలిపారు. కళాశాల శిక్షణ-ప్రాంగణ నియామకాల విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రక్రియలో టివిఎస్ ట్రెనింగ్ అండ్ సర్వీసెస్ సంస్థకు చెందిన మానవ వనరుల ఎంపిక నిపుణులు బిఆర్.కిరణ్ పాల్గొన్నారు. కంప్యూటర్ ఆధారితంగా రాత పరీక్ష, నైపుణ్యాల పరీక్ష, మౌఖిక పరీక్షల ద్వారా తుది జాబితా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కెవిఎస్ఆర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో యువతకు విరివిగా ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ఎంపికలో నైపుణ్యాల కొరత తీవ్రంగా ప్రభావం చూపుతోందన్నారు. డిగ్రీ విద్యార్థులు ప్రారంభం నుంచే జీవిత లక్ష్యాలు నిర్ణయించుకోవాలన్నారు. వాటి సాధన కోసం అవసరమైన సత్తాను అందిపుచ్చు కోవాలన్నారు. సంస్థ హెచ్ఆర్ బిఆర్ కిరణ్ మాట్లాడుతూ ఎంపికైన వారికి 21 రోజుల పాటు కంప్యూటర్ ద్వారా బ్యాంక్ కార్య కలాపాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డి.రాజగోపాల్‌రెడ్డి, డైరెక్టర్లు ఎంవి.క్రిష్టారెడ్డి, డాక్టర్ వెన్నా కృష్ణారెడ్డి, జివెల్.రమేష్‌బాబు, విఆర్‌కె. ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ పి.శ్రీధర్‌కుమార్, పరిశోధన విభాగం సమన్వయకర్త ఎం.శేషుకుమార్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కామర్స్ విభాగాధిపతి ఒ.ఏడుకొండలు, జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పిఆర్‌కె. ప్రసాద్, అర్థశాస్త్ర విభాగాధిపతి జి.రంగయ్య, తెలుగు విభాగాధిపతి డి.వినోద్, స్టాటిస్టిక్స్ విభాగాధిపతి బివి.పోలిరెడ్డి పాల్గొన్నారు.

పలకల పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకు రావాలి

ఎంపీ విజయసాయిరెడ్డికి వినతి

ప్రజాశక్తి-మార్కాపురం

అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన మార్కాపురం పలకల పరిశ్రమ నేడు సంక్షోభంలో కూరుకు పోయిందని, ఈ పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకు చ్చేందుకు కృషి చేయాలని ఎంపీ విజయసాయిరెడ్డికి వైసిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు తడికమళ్ల బాలసుబ్బారావు విజ్ఞప్తి చేశారు. విజయసాయిరెడ్డిని శుక్రవారం విజయవాడలో కలిసి ఈమేరకు విజ్ఞప్తి చేశారు. వైసిపి అనుబంధ విభాగాల సమావేశం అనంతరం పలకల పరిశ్రమ సంక్షోభంపై చర్చించారు. గతంలో వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించిన పలకల పరిశ్రమ నేడు వెలవెలబోతోందన్నారు. మార్కాపురం ప్రాంతంలో ఉన్న ఒక్క ఉపాధి అవకాశం కూడా లేకుండా పోతోందన్నారు. ప్రభుత్వం ఈ పరిశ్రమను ఆదుకునేందుకు ప్రత్యేక రాయితీలు కల్పించాలన్నారు. పలకల పరిశ్రమ ద్వారా ప్రభుత్వానికి గతంలో లాభం చేకూ రిందన్నారు. 1992 వరకూ రాతి పలకలుగా, ఆ తరువాత డిజైన్ పలకలుగా రూపాంతరం చెంది దన్నారు. పలకల పారిశ్రామికవాడలు గతంలో 200 పరిశ్రమలు ఉండగా నేడు 50 లోపు మాత్రమే నిర్వహణలో ఉన్నాయన్నారు. పరిశ్రమలో సంక్షోభం కారణంగా వేలాది మందికి ఉపాధి పోయిందన్నారు. కార్మికులతో పాటు వ్యాపారులకు, యజమానులకు నష్టం జరిగినట్లు తెలిపారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి ప్రత్యేక నిధులు కేటాయించడంతో పాటు పరిశ్రమ పుంజుకునేలా రాయితీలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

విజయసాయిరెడ్డితో తడికమళ్ల బాలసుబ్బారావు

సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలినేని

సహాయనిధి చెక్కు అందజేత

నాగులుప్పలపాడు : మండల పరిధిలోని మద్దిరాలపాడు గ్రామానికి చెందిన కె. సంగీతరావు అనారోగ్యంతో హైదరాబాదు లోని ఎఐజి ఆస్పత్రిలో చికిత్స పొందాడు. ఆయనకు ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సహకారంతో సిఎం సహాయనిధి నుంచి రూ.2.50 లక్షల చెక్కు మంజూరైంది. బాధితుడికి ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి శుక్రవారం రూ.2.50 లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జె. శ్రీనివాసరావు, వైసిపి నాయకులు పాల్గొన్నార్

సర్వేయర్‌గా సంజీవయ్య

ప్రజాశక్తి- గిద్దలూరు రూరల్

గిద్దలూరు మండల సర్వేయర్‌గా కె. సంజీవయ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ పెద్దారవీడు మండల సర్వేయర్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. గిద్దలూరు సర్వేయర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ పెద్దారవీడుకు బదిలీ అయ్యారు.

కురిచేడు తహశీల్దారుగా 'జ్వాలా'

కురిచేడు : కురిచేడు తహశీల్దారుగా జ్వాలా నరసింహం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పామూరు తహశీల్దారుగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడి వచ్చారు. గతంలో కురిచేడు తహశీల్దారుగా విధులు నిర్వహిస్తున్న షేక్ నాగుల్ మీరాను సిఎస్‌పురం మండలానికి బదిలీ అయ్యారు.

తహశీల్దారుగా నాగార్జునరెడ్డి

పామూరు : పామూరు తహశీల్దార్ నాగార్జునరెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ తహశీల్దారుగా పనిచేస్తున్న జ్వాలా నరసింహారావు కురిచేడుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వెలిగండ్ల తహశీల్దారుగా పనిచేస్తున్న నాగార్జునరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ నాగార్జునరెడ్డిని విఆర్‌ఒల సంఘం మండల కమిటీ ఘనంగా సన్మానించారు. తహశీల్దారును సన్మానించిన వారిలో విఆర్‌ఒల సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు అహమ్మద్ రఫీ, ఖాజారఫీ, విఆర్‌ఒలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌బికె సిబ్బందికి శిక్షణ

పెద్దారవీడు : మండల పరిధిలోని దేవరాజుగట్టు రైతు భరోసా కేంద్రంలో ఆర్‌బికె సిబ్బందికి శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసే పంటలు, ఎరువులు, పురుగు మందులు, విత్తన రకాలు, విత్తన దిగుబడులపై రైతు భరోసా కేంద్రం సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పెద్దారవీడు ఎఒ కె.బుజ్జిబాయి, రైతు భరోసా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అలరిస్తున్న 'అన్‌స్టాపబుల్'

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి వాస్తవ్యులు, వ్యాపారవేత్త సెల్ బే మొబైల్స్ ఫౌండర్ మరియు రెనీస్ గ్రూప్ అధినేత షేక్ రఫీ రెనిస్ ఎంటర్టైన్మెంట్ మరియు ఏ టు బి ప్రొడక్షన్స్ కలిసి నిర్మించిన చిత్రం అన్ స్టాపబుల్ అందరినీ అలరిస్తోంది. పూర్తి కామెడీ నటీనటులతో నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా విడుదల అయ్యింది. అదేవిధంగా పొదిలి పట్టణంలోని హరికృష్ణ థియేటర్‌లో ఈ చిత్రాన్ని ప్రదర్శించారు. డైమండ్ రత్నబాబు డైరెక్షన్లో ఏ టు బి బ్యానర్ పై ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ చిత్రంలో సప్తగిరి, బిగ్ బాస్ టైటిల్ విజేత విజె. సన్నీ, బిత్తర సత్తి, పోసాని మురళీకృష్ణ , వర్షిణి, చమ్మక్ చంద్ర, అక్ష , నక్షత్ర నటించారు.

కౌలు రైతుకు గుర్తింపు కార్డు దక్కేనా..?

- సిసిఆర్‌సి కార్డుల కోసం నిరీక్షణ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఆటు పోట్లనూ తట్టుకుంటూనే వ్యవసాయం చేస్తున్న కౌలు రైతులు చివరికి నష్టాల బాటపడుతున్నారు. వీరికి రైతు భరోసా, రాయితీపై విత్తనాలు, సబ్సిడీలు అందడం లేదు. వ్యవసాయ శాఖ అధికారులు ఇటీవల రైతులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. రైతుల కోసం అమలు చేస్తున్న పథకాల గురించి వివరిస్తున్నారు. కౌలు రైతులు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని చెబుతున్నారు.కౌలు రైతులందరికీ గుర్తింపు, పథకాల వర్తింపుపై అధికారుల వద్ద సరైన సమాధానం లేదు.

జిల్లా వ్యాప్తంగా..

జిల్లాలో 6,05,800 హెక్టార్ల సాగు భూమి ఉంది. అదేవిధంగా 4,77,669 వ్యవసాయ కుటుంబాలు ఉన్నాయి. 616 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. ఈ ఏడాది 38,430 వేల మంది కౌలు రైతులకు గుర్తింపు (సిసిఆర్‌సి) కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు. సాగులో 70 శాతం వరకూ కౌలు రైతులే ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది పేదవారే.

కీలకపాత్ర పోషిస్తున్న కౌలు రైతులు

వ్యవసాయంలో కీలకపాత్ర పోషిస్తున్న కౌలు రైతులను ప్రభుత్వం విస్మరించింది. గుర్తింపు కార్డుల జారీ లక్ష్యమే అందుకు ఉదాహరణగా చెప్పొచ్చు. అందరికీ కార్డులివ్వాలనే చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వం ప్రస్తుతం నిర్వహిస్తున్న సాగుకు సమాయత్తం సభల ద్వారానే గ్రామాల్లోని కౌలురైతుల గుర్తించవచ్చు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 287 మందికి మాత్రమే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ అయ్యాయి. మిగతా కౌలు రైతులు కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు.

అర్హులందరికీ కార్డులు

కె దాసు, ఇన్‌ఛార్జి తహశీల్దారు, యర్రగొండపాలెం

కౌలు రైతు గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ కార్డులు జారీ చేస్తాం. రైతు భరోసా కేంద్రం, విఆర్‌ఒల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. మీ-సేవ కేంద్రాల ద్వారా కూడా దరఖాస్తు చేసుకున్నా కార్డులిస్తాం. ఈ అవకాశాన్ని కౌలు రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలి.

కౌలు దార్లందరికీ కార్డులివ్వాలి

వి బాలకోటయ్య, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి

భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులివ్వాలి. సాగులో 60-70 శాతం భూమిని కౌలుదార్లే ఉన్నారు. ప్రభుత్వం విధించిన నిబంధనలు, కౌలు రైతు చట్టం చేసిన మార్పుల వల్ల 10-20 శాతానికి మించి గుర్తింపు కార్డులు రావడం లేదు. ఈ క్రాప్ నమోదు, రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ విషయంలో కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

హెచ్‌ఎంలు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-పిసిపల్లి

మండల పరిధిలోని పెదఇర్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా అద్దంకి మల్లికార్జున, నేరేడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయుడిగా టి.అంజనీదేవి, పిసిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా ఆర్.శ్రీనివాసరావు, మురుగుమ్మి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయుడిగా కె. సుబ్బారెడ్డి, గుంటుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా ఎల్.శ్రీనివాసరావు శుక్రవారం విధుల్లో చేశారు. వీరికి యుటిఎఫ్ జిల్లా నాయకులు ఎ.పోతులూరయ్య, పిసిపల్లి మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.యేసుబాబు, సిహెచ్.రమేష్ స్వాగతం పలికి అభినం దించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు ఐక్యంగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

నేడు టిడిపి నాయకుల సమావేశం

ప్రజాశక్తి-కొండపి

టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఇటీవల ప్రకటించిన మేనిఫెస్టోపై చర్చా వేదిక నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షుడు బి. యలమందనాయుడు తెలిపాడు. ఐఒసి ఎదురుగా ఉన్న దామచర్ల కంపెనీలో శనివారం సాయంత్రం 3 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యఅతిథులుగా కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ , మండల , క్లస్టర్, యూనిట్, అనుబంధ సంఘాలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అగ్రహారం విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి -సిఎస్ పురం రూరల్

ఎపి గురుకుల పాఠశాలలో ఆరవ తరగతిలో ప్రవేశం కోసం గత నెల 20న ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షల్లో మండల పరిధిలోని కె.అగ్రహారం ప్రాథమిక పాఠశాలకు చెందిన శ్యామల వెంకట శివారెడ్డి ప్రతిభ చూపి 43వ ర్యాంకు సాధించాడు. ఏపీఆర్ఎస్ గణపురంలో ఓపెన్ క్యాటగిరిలో రెండు సీట్లు వుండగా శివారెడ్డి అక్కడ సీటు సాధించాడు. ఈ సందర్భంగా వెంకట శివారెడ్డిని పాఠశాల ప్రధానో పాధ్యాయుడు శాతల వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయురాలు జజం అనూష, పాఠశాల పిఎంసి చైర్మన్ పిడతల చిరంజీవి, గ్రామస్తులు అభినందించారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పాపారావు

మేనిఫెస్టోతో 'భవిష్యత్'కు గ్యారంటీ

మాజీ ఎమ్మెల్యే పాపారావు

ప్రజాశక్తి-దర్శి

భవిష్యత్‌కు గ్యారంటీ ఇస్తూ టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రకటించిన మొదటివిడత మేనిఫెస్టో రాష్ట్ర ప్రజల జీవితాలలో సుఖసంతోషాలు, వెలుగు నింపేలా ఉందని దర్శి మాజీ ఎమ్మెల్యే నారపశెట్టి పాపారావు తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సమావేశం పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నారపశెట్టి పాపారావు మాట్లాడుతూ వైసిపి పాలనలో ప్రజల భవిష్యత్‌కు గ్యారంటీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో నగరపంచాయతీ చైర్మన్ నారపశెట్టి పిచ్చయ్య, టిడిపి మండల అధ్యక్షులు చిట్టే వెంకటేశ్వర్లు, నాయకులు నాగులపాటి శివకోటేశ్వరరావు, బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి, శ్రీనివాసరావు, నెమిలయ్య, సంగా తిరుపతిరావు, శాగం కొండారెడ్డి, మాజీ ఎంపిపి వెంకట్రావు, మాజీ జడ్‌పిటిసిలు నాగరాజు, పాల్, వెంకటేశ్వర్లు, బెల్ల శ్రీను పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : సర్పంచి

ప్రజాశక్తి-సింగరాయకొండ

కార్మికులతో మాట్లాడుతున్న సర్పంచి

శింగరాయకొండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులతో సర్పంచి తాటిపర్తి వనజ శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు మాట్లాడుతూ తమకు ఐదు నెలలుగా జీతాలు ఇవ్వలేదని తెలిపారు. దీంతో పనులు నిలుపుదల చేసినట్లు తెలిపారు. దీంతో స్పందించిన సర్పంచి మాట్లాడుతూ తక్షణం పరిష్కరించే విధంగా చూస్తానని తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల జీతాలు బిల్లులు ఆగినట్లు తెలిపారు. జీతాలు వెంటనే వచ్చే విధంగా చూస్తామని తెలిపారు. పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎస్. సుబ్రమణ్యం, శానిటరీ సిబ్బంది రామయ్య, శానిటరీ మేస్త్రి వెంకటేశ్వర్లు, బిల్ కలెక్టర్లు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి-టంగుటూరు

బాధితులను పరామర్శిస్తున్న డాక్టర్ వెంకయ్య.

మండల పరిధిలోని ఎం. నిడమలూరు గ్రామంలో గురువారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబ సభ్యులను పిడిసిసి బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకయ్య రోడ్డు ప్రమాదం జరిగిన తీరుగురించి బాధితుల అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాద ఘటన తనను ఎంతగానో కలచివేసినట్లు తెలిపారు. మృతుల కుటుంబ సభ్యులు ఎలాంటి అవసరం వచ్చినా ఎప్పుడైనా తనను నేరుగా కలిసి సహాయం పొందవచ్చని డాక్టర్ వెంకయ్య భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదాయ పన్ను శాఖ కమిషనర్ బొడ్డు వెంకటేశ్వరరావు, నాయకులు మనం హరిబాబు, వల్లంరెడ్డి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే టిడిపి లక్ష్యం : ఉగ్ర

ప్రజాశక్తి-కనిగిరి

మాట్లాడుతున్న డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

ప్రజా సంక్షేమమే టిడిపి లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే, టిడిపి కనిగిరి నియోజక వర్గ డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. కనిగిరి పట్టణంలోని అమరావతి గ్రౌండ్‌లో భవిష్యత్‌కు గ్యారెంటీపై చర్చా వేదిక నియోజక వర్గ స్థాయి పరిధిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పరిశీలకులు గంగోడు నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు భవిష్యత్‌కు గ్యారెంటీ మినిమేనిఫెస్టోను విడుదల చేశారు. అనంతరం డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ మేనిఫెస్టోను ప్రజలలోకి తీసుకుపోవాలని టిడిపి శ్రేణులకు సూచించారు. సైకో పాలన పోవాలని,సైకిల్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బాలినేనికి సన్మానం

ప్రజాశక్తి- కనిగిరి

బాలినేనికి స్వాగతం పలుకుతున్న దారపనేని

మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి శుక్రవారం కనిగిరికి ఈ సందర్భంగా స్థానిక వైసిపి నాయకులు బాలినేనికి ఘన స్వాగతం పలికారు. కనిగిరి ఎఎంసి మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ ఘన స్వాగతం పలికారు. అనంతరం బాలినేని అనారోగ్యంతో బాధపడుతున్న వైసిపి నాయకుడు రాజుల ఆదిరెడ్డి, మోకాళ్ళ ఆపరేషన్ చేయించుకున్న వైఎం. ప్రసాద్‌రెడ్డిని పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హనుమంతునిపాడు జడ్‌పిటిసి దద్దాల నారాయణ, వైసిపి నాయకులు మూలె గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలపై సమీక్ష

జరుగుమల్లి : జగనన్నకాలనీ లేఅవుట్ల లబ్ధిదారులు గృహాలు నిర్మించకపోతే వారి పట్టాలను రద్దు చేస్తామని హౌసింగ్ పీడీ పేరయ్య హెచ్చరించారు. జరుగుమల్లి పంచాయతీ కార్యాలయంలో జగనన్న గృహాల నిర్మాణాలపై సర్పంచి కసుకుర్తి పున్నారావు అధ్యక్షతన శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ పేరయ్య మాట్లాడుతూ లక్షలాది రూపాయలు వెచ్చించి జగనన్న కాలనీల్లో మట్టి తోలి మెరక చేసినట్లు తెలిపారు. విద్యుత్, ఇంటింటికీ తాగు నీటి కుళాయి ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిఇ జయరావు, ఎంపిడిఒ కె.జలజాక్షి, తహశీల్దారు ఉషారాణి, అడ్మినిస్ట్రేషన్ అధికారి పి.రామకృష్ణ, బెల్లం సత్యన్నారాయణ, పిఆర్ఎఇ కోట శ్రీహరి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రమేష్, హౌసింగ్ ఎఇ అవినాష్, పశువైద్యాధికారి అరుణ, ఎపిఎం భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

పొదిలి : వాహన చోదకులు రహదారి భద్రత పాటించాలని ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. పొదిలి విశ్వనాథపురం సెంటర్‌లో శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా నిబంధనలను అతిక్రమించి వాహనాలు నడుతున్న చోదకులను గురించి జరిమానా విధించారు.

ప్రజాశక్తి
7
శనివారం 10 జూన్ 2023

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం: మోపిదేవి

ప్రజాశక్తి-రేపల్లె

వైసీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమం అభివృద్ధి రెండు కళుగా రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. పట్టణంలోని 13వ వార్డులో జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మోపిదేవి వెంకటరమణారావు పాల్గొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిఎం జగన్మోహన్‌రెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారన్నారు. ఈ సందర్భంగా మోపిదేవి వెంకటరమణారావు ఇంటింటికీ ప్రజల వద్దకు వెళ్లి వైసిపి అధికారంలోకి వచ్చిన మూడున్నర సంవత్సర కాలంలో ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను కరపత్రాల ద్వారా వివరించి అందించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌దే అన్నారు. పేద ప్రజలను సంక్షేమ పథకాలతో ఆదుకోవడం ప్రతిపక్ష పార్టీలకు నచ్చడం లేదని, దీంతో ప్రభుత్వంపై లేనిపోని అపనిందలు వేస్తూ ప్రతిపక్షాలు ప్రజలను మోసగించే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ఎన్ని ఆటంకాలు వచ్చినా రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన సాగుతోందని, రాబోయే రోజుల్లో కూడా జగన్‌కు ప్రజల ఆశీర్వాదాలు కావాలని కోరారు. జగనన్న గృహ సారథులు, గ్రామ వాలంటీర్లు, గ్రామ సచివాలయ కన్వీనర్లు స్థానికంగా ఉన్న నాయకులతో కలిసి పనిచేస్తే 2024లో మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అవటం ఖాయమన్నారు. ఇప్పటికే గడప గడపకూ మన ప్రభుత్వం పేరుతో లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమ పథకాల వివరాలతో దాదాపు ప్రతి ఇంటినీ సందర్శించామని, తమ ప్రభుత్వం ప్రజలు తెలిపిన సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి త్వరితగతిలో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, మున్సిపల్ చైర్మన్ కట్టా మంగా సుబ్బారావు, మోపిదేవి రాజీవ్ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

గడప గడపకూలో పాల్గొన్న ఎంపీ మోపిదేవి వెంకట రమణ

సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

వ్యవసాయ సలహా కమిటీ సమావేశం

ప్రజాశక్తి-వేటపాలెం

రామన్నపేట-2 రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ సలహా కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఐటిసి ప్రాజెక్ట్ మేనేజర్ శాస్త్రి మాట్లాడుతూ స్థిరమైన వ్యవసాయం చేసేవారికి ఐటీసీ కంపెనీ వాళ్ల తోడుగా ఉంటూ సహాయ సహకారాలు అందిస్తారని పేర్కొన్నారు. కమిటీ సభ్యులు పాల్గొని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు సమావేశంలో చర్చించారు. మండల స్థాయిలో చర్చించిన వివిధ అంశాలను జిల్లా స్థాయి కమిటీ దృష్టికి తీసుకువెళ్లాలని తీర్మానించుకున్నారు. ఈ సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి శర్మ, మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ పల్లప్రోలు శ్రీనివాసరావు కమిటీ సభ్యులు జంగిలి రామారావు, పశు వైద్య అధికారి భాగ్యశ్రీ, ఐటీసీ గ్రామసిరి ప్రాజెక్ట్ మేనేజర్ ఆర్ శ్రీనివాస శాస్త్రి, ఏపీ సిఎన్ఎఫ్ సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సర్దుబాటు, ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై భారం

ప్రజాశక్తి-భట్టిప్రోలు

వైసిపి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి 8 సార్లు విద్యుత్ చార్జీలు పెంచటమే కాకా మరోమారు 9వ విడత సర్దుబాటు, ట్రూఅప్ చార్జీల పేరుతో రూ.6 వేల కోట్ల భారాన్ని మోపటం సరికాదని టిడిపి రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్దుబాటు పేరుతో రెండు నెలలకు ఒకసారి పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే విరమించాలని ఆయన డిమాండ్ చేశారు. నవరత్నాల పేరుతో సంక్షేమం అందిస్తామన్న జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాలుగేళ్లలో 9 విడతలుగా విద్యుత్ చార్జీలు పెంచి భారం మోపటం హేయమైన చర్య అని అన్నారు. వైసిపి అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచే ప్రసక్తి లేదని ప్రజలను మోసం చేసారని ఆగ్రహం వ్యక్తంచేశారు. చంద్రబాబు నాయుడు ఐదు ఏళ్ల పాటు రాష్ట్రంలో ఏనాడూ విద్యుత్ చార్జీలు పెంచకపోగా నాణ్యమైన విద్యుత్ ను అందించారన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో ఎప్పుడు కరెంటు వస్తుందో, పోతుందో తెలియడం లేదని ఎద్దేవా చేశారు. నూతన పరిశ్రమలు కూడా రాకుండా పోయాయని విమర్శించారు. కేంద్రం నుంచి రాయితీ పొందేందుకు రైతుల మోటర్లకు మీటర్లు బిగించారని, దీని వలన రైతుల్లో తీవ్ర ఇబ్బందులు గురికావలసి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుక్కల వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, లంక ప్రసాద్, షంషుద్దీన్, శరత్, నాంచారయ్య తదితరులు ఉన్నారు. ఏల్చూరు గ్రామంలో నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారి నిర్మానుష్యంగా మారింది.

మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి సాయిబాబా

సోన పోరంబోకు స్థలం

కబ్జా ప్రయత్నం మానుకోవాలి

ప్రజాశక్తి-వేటపాలెం

మండల పరిధిలోని దేశాయిపేట, నాయనపల్లి బోర్లపాలెంలో సుమారు అర ఎకరం సోన పోరంబోకు స్థలాన్ని కబ్జా చేసేందుకు గుంటూరు మాధవరావు (మధు) అనే వ్యక్తి ప్రయత్నం చేస్తున్నారని బహుజన్ సమాజ్ వాదీ పార్టీ నాయకులు ఆరోపించారు. శుక్రవారం బహుజన సమాజ్ వాదీ పార్టీ నాయకులు వివాదాస్పద స్థలంలో మీడియాతో మాట్లాడారు. సదరు స్థలంలో దళిత వర్గానికి చెందినవారు పశువుల పాకలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. వీరంతా దాదాపుగా నలభై సంవత్సరాలుగా ఇక్కడ నివసిస్తూ ఈ భూమిపై ఆధారపడి జీవిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో గుంటూరు మాధవరావు(మధు) అనే వ్యక్తి పోలీసులు, రౌడీల అండతో ఈ భూమిని స్వాధీనం చేసుకోవాలనే తలంపుతో ఎస్సీ మాదిగలమైన తమపై దౌర్జన్యానికి పాల్పడి తమ పశువుల పాకలను సైతం కూలదోశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇతనికి ఈపాటికే చాలా భూమి ఉందని, అయినా తమ భూమి కోసం తమను కులం పేరుతో దూషిస్తూ దుర్భాషలాడుతున్నాడని వాపోయారు. ఈ సమస్యపై జిల్లా స్థాయి అధికారులను కలిసి ఫిర్యాదులు చేసినా ఫలితం లేదని అన్నారు. బహుజన సమాజ్ పార్టీ నాయకులు గొర్రెపాటి రవికుమార్, భగత్‌సింగ్, షేక్ షరీఫ్ తదితర నాయకులు మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా ఇక్కడ నివసిస్తున్న దళిత వర్గాలపై మాధవరావు అసభ్యకరమైన పదజాలంతో దూషిస్తున్నారని అన్నారు. ఈ విధంగా మాట్లాడటం తగదని వారు ఖండించారు. సుప్రీంకోర్టు సైతం ప్రభుత్వ స్థలాలలో నివాసం ఉండేవారికి ప్రాధాన్యం ఇవ్వాలని తీర్పునిచ్చిందన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న బిఎస్‌పి నాయకులు

మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణ

దేవాలయ ప్రతిష్ఠా మహోత్సవం

ప్రజాశక్తి-రేపల్లె: మండలంలోని పెనుముడి గ్రామంలో శుక్రవారం క్రీస్తు లూథరన్ దేవాలయం ప్రతిష్ఠా మహోత్సవం వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, దేవినేని మల్లికార్జునరావు, యలవర్తి వెంకటరావు, మోపిదేవి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఆలయ అభివృద్ధికి రూ.లక్షల విరాళం అందించారు. చర్చి ఫాదర్ బైబిల్ సందేశాన్ని అందించారు. కార్యక్రమానికి ముందుగా నూతన దేవాలయ ప్రతిష్ట కార్యక్రమాన్ని ప్రారంభించారు. నూతన దేవాలయ నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ గ్రామస్తులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, దైవజనులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న దృష్ట్యా రైతులకు పచ్చి రొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఎంపిపి డివి లలితకుమారి తెలిపారు. మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ సిబ్బంది నిరంతరం రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. 50 శాతం రాయితీపై అందిస్తున్న జనుము, జీలుగా విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ మీరయ్య, కమిటీ చైర్మన్ కుందేటి రమేష్, విఏఏలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మీరయ్య

ఎండ దెబ్బకు నిర్మానుష్యంగా మారిన సంతమాగులూరులోని ఓ వీధి

హెచ్ఐవి బాధితులకు మందులు పంపిణీ

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

బాపట్ల మండలం నందిరాజు తోట గ్రామంలోని గ్రామసిరి ప్రాజెక్టు కార్యాలయంలో శుక్రవారం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం, షేర్ ఇండియా వారి సహకారంతో హెచ్ఐవి బాధితులకు ఏఆర్‌టి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా సూపర్‌వైజర్ జే వీరాస్వామి మాట్లాడుతూ హెచ్ఐవితో జీవిస్తున్న వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని అన్నారు. ఉచితంగా ఖరీదైన ఏఆర్‌టి మందులు ఇస్తూ వారి ఆరోగ్యం కోసం పని చేస్తుందన్నారు. ఏఆర్‌టి మందులు క్రమం తప్పకుండా వాడాలని సూచించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం పర్యవేక్షణ అధికారి పి శ్రీవిద్య మాట్లాడుతూ ఏఆర్‌టి మందులు వైద్యులు సూచించిన సమయానికి తీసుకొని వారి పర్యవేక్షణలో మందులు వాడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కే రత్నకుమార్, షేర్ ఇండియా ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏఆర్‌టి మందులు వాడుతున్న వారు క్రమం తప్పకుండా సిడి 4 వైరల్ లోడ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రాజెక్ట్ ఫీల్డ్ ఆఫీసర్ మాట్లాడుతూ హెచ్ఐవితో జీవిస్తున్న వారికీ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు వినియోగించుకోవాలని సూచించారు. గ్రామసిరి ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆర్ శ్రీనివాసశాస్త్రి మాట్లాడుతూ రానున్న రోజుల్లో గ్రామసిరి టిఐ అనేక వినూత్నమైన కార్యక్రమాలు చేపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ కే వెంకటరావు ఎంఅండ్ఈ కే శ్రీనివాసరావు, గ్రామసిరి సిబ్బంది పాల్గొన్నారు.

సంతమాగులూరులో అత్యధిక ఉష్ణోగ్రత

ప్రజాశక్తి-సంతమాగులూరు

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని సంతమాగులూరు మండలంలో శుక్రవారం పగలు 44 డిగ్రీల అధిక ఉష్ణోగ్రత నమోదయింది. దీంతో ఆయా గ్రామాలలోని ప్రధాన రహదారులు నిర్మానుషంగా మారాయి. రోహిణి కార్తె పోయి, మృగశిర కార్తె వచ్చినప్పటికీ ఎండ తీవ్రత తగ్గలేదు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కూడా వేడి సెగలు తగ్గలేదు. దీనికి తోడు ఇండ్లలో విద్యుత్ లేకపోవడంతో ప్రజలు ఉక్కపోతలకు తల్లడిల్లారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణులు ఇబ్బందులకు గురయ్యారు. విద్యుత్ అధికారులు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సింగరకొండ దేవస్థానంలో హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

దేవస్థానంలో హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-అద్దంకి: సింగరకొండ శ్రీప్రసన్నాంజనేయ స్వామివారి దేవస్థానంలో శుక్రవారం దేవదాయశాఖ అధికారుల సమక్షంలో హుండీ లెక్కింపు కార్యక్రమం జరిగినది. మొత్తం 90 రోజులకు రూ.34,81,454 నగదు, గ్రా.24.400మి.గ్రా బంగారం, 439 గ్రాముల వెండి భక్తులు స్వామి వారికి సమర్పించారు. వీటితోపాటు విదేశీ కరెన్సీ కూడా లభించింది. జె పంగులూరు గ్రూపు దేవస్థానాల కార్యనిర్వహణాధికారి యు శ్రీనివాసరావు, సహాయ కమిషనర్ కార్యనిర్వహణాధికారి టి సుభద్ర పర్యవేక్షణలో జరిగింది. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవస్థాన అర్చక, ఇతర సిబ్బంది, భక్తులు, గ్రామస్తులు, అద్దంకి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు పాల్గొన్నారు.

దళిత ద్రోహి జగన్మోహన్‌రెడ్డి..

- తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు అనిత
- హనుమాయమ్మ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-టంగుటూరు

దళిత ద్రోహి సిఎం జగన్ మోహన్‌రెడ్డి అని, వైసీపీ ప్రభుత్వంలో అతికిరాతకంగా చంపబడుతుంది దళితులే అని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత విమర్శించారు. టంగుటూరు పంచాయతీ పరిధి రావివారిపాలెంలో ఇటీవల హత్యకు గురైన అంగన్వాడీ కార్యకర్త సవలం హనుమాయమ్మ కుటుంబ సభ్యులను శుక్రవారం అనిత పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక ఆడబిడ్డను అత్యంత దారుణంగా ట్రాక్టర్ తో తొక్కించి హత్య చేస్తే దళిత మంత్రితో సహా పదవులలో ఉన్న ఏ ఒక్క మంత్రి కూడా బాధిత కుటుంబం పట్ల సానుభూతి ప్రకటించకపోవడం దళిత ద్రోహం కాక మరేమిటని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రధానంగా దళిత మహిళలే అధికంగా బాధింపబడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడి పరిణామాలు చూస్తే ఇది కచ్చితంగా రాజకీయ, ప్రభుత్వ హత్య గానే ఆమె అభివర్ణించారు. రాజకీయ పలుకుబడితో తమను ఎవరూ ఏమీ చేయలేరన్న ధీమాతోనే ఒక ఆడబిడ్డను దారుణంగా హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ ఎస్పీ కూడా ఇది కుటుంబ హత్య అని ప్రకటించడం దారుణమన్నారు. హత్య జరిగిన నాటి నుండి తెలుగుదేశం పార్టీయే అన్ని విధాలా తమకు అండగా ఉన్నట్లు బాధిత కుటుంబం చెబుతోందన్నారు. కార్యక్రమంలో కొండపి శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, టంగుటూరు సర్పంచ్ మద్దిరాల మమత, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి ధర్నాసి బ్రహ్మానందం, హనుమాయమ్మ భర్త సవలం సుధాకర్, మహిళా నాయకులు తోకల భారతి, చుండూరి పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న అనిత

19 నుంచి రాష్ట్ర శిక్షణా తరగతులు

జయప్రదం చేయాలని కెవిపిఎస్ జిల్లా కమిటీ పిలుపు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు అంబేద్కర్ భవనలో ఈ నెల 19, 20, 21 తేదీలలో జరగనున్న కెవిపిఎస్ రాష్ట్ర శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని జిల్లా కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక కెవిపిఎస్ జిల్లా కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షులు జవ్వాజి రాజు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి బి రఘురామ్ మాట్లాడుతూ ఈనెల 19,20,21 తేదీలలో ఒంగోలు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవనం లో జరగనున్న కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర శిక్షణ తరగతులను జయప్రదం చేయాలన్నారు. ఆర్ఎస్ఎస్ రాజకీయ విభాగమైన బిజెపి మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సమాజంలో మనుధర్మ శాస్త్ర భావజాలాన్ని విస్తతంగా ప్రచారంలోకి పెడుతున్న నేపథ్యంలో దేశంలో దళితులు, గిరిజనులు, మహిళలు, మైనార్టీల మీద దాడులు, హత్యలు,అత్యాచారాలు తీవ్రంగా పెరుగుతున్నాయన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తూ ప్రజలకు వచ్చిన హక్కులు, చట్టాలను లేకుండా చేస్తున్న నేపథ్యంలో మనుధర్మ శాస్త్ర, రాజ్యాంగ వ్యతిరేక భావజాలాన్ని తిప్పికొట్టడానికి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర తరగతులు జయప్రదానికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. జిల్లా ఉపాధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ భారతదేశంలో నేటికీ కొనసాగుతున్న సామాజిక ఆర్థిక అంతరాలను తుదముట్టించేందుకు అంతరాలు లేని సమాజ నిర్మాణానికి అంకితమై పనిచేస్తున్న కెవిపిఎస్ రాష్ట్ర తరగతుల జయప్రదానికి ప్రతి ఒక్కరూ చేయూతనందించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు అట్లూరి రాఘవులు, జిల్లా ఉపాధ్యక్షులు టి. రామారావు, వి. మోజేష్, సహాయ కార్యదర్శి అత్తంటి శ్రీనివాసరావు, జె.రత్నం జిల్లా కమిటీ సభ్యులు ఎం.విక్టర్ ఎల్ .రాజశేఖర్, కె.యోబు, బ్రహ్మయ్య, ఏ.సూరిబాబు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రఘురామ్

‘శ్రీ వికాస్’ విద్యార్థికి 207వ ర్యాంకు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎపిఆర్‌జెసి ప్రవేశ ఫలితాలలో శ్రీ వికాస్ కోచింగ్ సెంట్ విద్యార్థిని రాష్ట్ర స్థాయిలో 207వ ర్యాంకు సాధిచింది. గత నెల 20వ తేదీ జరిగిన ఎపిఆర్‌జెసి ప్రవేశ ఫలితాలలో స్థానిక అంజయ్య రోడ్డులోని శ్రీ వికాస్ కోచింగ్ సెంటర్ విద్యార్థిని బి.షారోన్ గ్రేస్(ఒంగోలు) రాష్ట్ర స్థాయిలో బైపిసి విభాగంలో 207వ ర్యాంకు సాధించింది. ఇదే కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన ఆర్.రమేష్(అద్దంకి) ఎంపిసిలో రాష్ట్ర స్థాయిలో 250వ ర్యాంకు, ఆర్.మృదులకు ఎంపిసిలో 258 ర్యాంకు, ఎం.గిరిధర్‌కు 304 ర్యాంకు, ఎం.పద్మకు 520 ర్యాంకులు వచ్చాయి. మొత్తం 1000 లోపు 15 మంది విద్యార్థులకు ఎపిఆర్‌జెసి ర్యాంకులు వచ్చినట్లు కోచింగ్ సెంటర్ కరస్పాండెంట్ కె.మోహనరావు, డైరెక్టర్ పి.వీరయ్య అభినందనలు తెలిపారు. ఎపిఆర్‌జెసి ర్యాంకులు సాధించిన విద్యార్థులు, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు వారు అభినందించారు.

షారోన్ గ్రేస్ (ఫైల్)

సిఎంకి రాష్ట్ర ఎన్జీవో అసోసియేషన్ కృతజ్ఞతలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

12వ వేతన సవరణ కమిటీని వేసిన, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసినందుకు రాష్ట్ర ముఖ్య మంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి రాష్ట్ర ఎన్జీవో అసోసియేషన్ నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని కలిసిన ఎన్జీవో నేతలు ఘనంగా సత్కరించారు. ఎటువంటి ఆందోళనలు లేకుండా ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక, పెన్షనర్ల సంక్షేమం కోసం గడువు లోపల 12వ వేతన సవరణ కమిటీని వేయటం, ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయటం, ఏపీ వైద్య విధాన పరిషత్‌లో జీతాల కోసం ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులకు విముక్తి కల్పించి 010 పద్దులో వారిని చేర్చినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి నేతలు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కెవి శివారెడ్డి నేతత్వంలో ఇరిగేషన్ డిపార్ట్మెంట్ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ, ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ప్రకాశం జిల్లా కార్యదర్శి ఆర్ సి హెచ్ కష్ణారెడ్డి పాల్గొన్నారు.

సిఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న అసోసియేషన్ నాయకులు

సన్సద్ ఆదర్శ గ్రామాలను

అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలి

కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

సన్సద్ ఆదర్శగ్రామ యోజన కింద ఎంపిక చేసిన గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టరు పి.రంజిత్ బాషా చెప్పారు. సన్సద్ ఆదర్శ గ్రామ యోజనపై జిల్లాస్థాయి కమిటి తొలిసమావేశం శుక్రవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో జరిగింది. గ్రామాల అభివద్ధికి అధికారులు సమగ్ర ప్రణాళికలు రూపొందించి వాటిని అమలుచేయాలని కలెక్టరు తెలిపారు. 2016లో పార్లమెంట్ లో రూపొందించిన చట్టం మేరకు పార్లమెంట్ సభ్యులు ప్రతి ఏటా ఒక గ్రామాన్ని దత్తత తీసుకుంటారన్నారు. దత్తత తీసుకున్న ఆ గ్రామాన్ని మూడేళ్లలో అన్నివిధాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాల్సి ఉందన్నారు. పార్లమెంట్ సభ్యులు దత్తత తీసుకున్న గ్రామాన్ని అభివద్ధి చేయడానికి అధికారులు సమగ్ర ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఆ గ్రామాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాల్సి ఉందన్నారు. దీనికి ఎం.పి ల్యాడ్స్ నిధులు కేటాయించ వచ్చన్నారు. ఆగ్రామాలలో 35 అంశాలలో సుస్థిరాభివద్ధి లక్ష్యాలను చేరుకునేలా అధికారులు పనిచేయాల్సి ఉంటుందన్నారు. మన జిల్లాలో ప్రస్తుతం బాపట్ల పార్లమెంట్ సభ్యులు నందిగాం సురేష్, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ ఉన్నందున గడిచిన మూడేళ్లలో 6 గ్రామాలను ఎంపిక చేసినట్లు వివరించారు. నిజాంపట్నం మండలం కొత్తపాలెం, కూచిపూడి, వేమూరు మండలం జంపాని, చెరుకుపల్లిలోని పొన్నపల్లి, రేపల్లెలోని మూలగుంట, సంతమాగులూరు లోని ఏల్చూరు గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ప్రజల జీవన విధానంలో మార్పు తీసుకురావడం, సమానత్వం, సామాజిక న్యాయం అమలుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టరు రంజిత్ బాషా చెప్పారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడం, లింగభేదం లేని సమాజ స్థాపన, వ్యక్తిగత అభివృద్ధి మానవవనరులు, సామాజిక, ఆర్థిక అభివద్ధి, పారిశుద్ధ్యంతో పర్యావరణాన్ని పరిరక్షించడం, నూరు శాతం జనన, మరణాల నమోదు జరిగేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఆ గ్రామాలలో కనీస మౌళిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఆయా గ్రామాలను అధికారులు నిరంతరం సందర్శిస్తూ అభివద్ధి బాటలోకి నడిపించాలన్నారు. ముఖ్యంగా ఆగ్రామాలలో వలసలు నివారించడం, ప్రజల జీవనోపాధులు మెరుగుపడేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అభివద్ధిలో గ్రామస్తులను భాగస్వామ్యం చేయాలని ఆయన పలు సూచనలు చేశారు. గ్రామాలవారీగా జరుగుతున్న పనులను ఆయన సమీక్షించారు.సమావేశంలో గుంటూరు జెడ్.పి సి.ఇ.ఓ జె.మోహన్ రావు, ప్రకాశం జెడ్.పి సి.ఇ.ఓ బి.జాలి రెడ్డి, అనుబంధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

12న వై.పాలెంలో ప్రత్యేక స్పందన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రతి సోమవారం ఒంగోలులో జరుగుతున్న స్పందన కార్యక్రమాన్ని యర్రగొండపాలెం అసెంబ్లీ నియోజకవర్గంలో "ప్రత్యేక స్పందన" కార్యక్రమం సోమవారం జరుగుతుందని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. ప్రత్యేక స్పందన కార్యక్రమం యర్రగొండపాలెంలోని బాబు జగజ్జీవనరావు- అంబేద్కర్ ఆడిటోరియం, మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 12న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఎర్రగొండపాలెంలో సోమవారం జరిగే "ప్రత్యేక స్పందన" కార్యక్రమానికి కార్యక్రమంలో జిల్లా అధికారులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. ప్రజలందరూ ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. 1

చుక్కల భూమి హక్కు పత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-కొత్తపట్నం

ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి కలం పోటుతో లక్షల మందికి శాశ్వత భూ హక్కు పత్రాల లబ్ధి చేకూరిందని, లక్షల మంది రైతులు ప్రయోజనం పొందారని మండల పరిషత్ అధ్యక్షులు లంకపోతు అంజిరెడ్డి అన్నారు. శుక్రవారం రెవెన్యూ కార్యా లయం ఆవరణలో నిర్వహించిన చుక్కల భూమి హక్కుల పత్రాల పంపిణీ కార్యక్రమా నికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఒంగోలు రెవెన్యూ డివిజనల్ అధికారి విశ్వేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఆర్డీవో విశ్వేశ్వరరావు మాట్లాడుతూ డివిజన్ పరిధిలో 6889 మంది రైతులకు లబ్ధి చేకూరిందని 5776 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేసిన అవకాశం కలిగిందన్నారు. జిల్లాలోని కొత్తపట్నం మండలంలో ఎక్కువ మంది రైతులు లబ్ధి పొందారన్నారు. డివిజన్లో 68 గ్రామాలలో రీ సర్వే జరుగుతుందని తెలిపారు. అనంతరం రైతులకు భూమి హక్కు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సలహా మండలి చైర్మన్ ఆళ్ళ రవీందర్ రెడ్డి, ఎంపీడీవో పి సుజాత, విఆర్సి, మత్స్యశాఖ సహకార సంఘం డైరెక్టర్ సుమతి, మాజీ ఎంపీపీలు వాయల మోహన్ రావు, బలగాని శ్రీనివాసరావు , హౌసింగ్ శాఖ డి ఈ నారాయణరెడ్డి, నాంచాలరెడ్డి, ఏవో మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీవో